
**ఈసారి దసరా స్పెషల్ సిందూర్ బొమ్మల కొలువు**



2



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 18 సెప్టెంబర్ 2025 | సంపుటి:9 | సంచిక:261 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



**డ్రైవర్‘లెస్’ డెలివరీ వెహికిల్స్**



2







# మహిళల భద్రతలో విశాఖ అగ్రస్థానం

## పివి ఆర్థిక సంస్కరణలతో ముందడుగు

### ఐటి రంగంలో భారత్ బలంగా ఉంది

### వికసిత్ భారత్ లక్ష్యంతో మోడీ కృషి

### సిఎం చంద్రబాబు నాయుడు

**విశాఖపట్నం, (మనం న్యూస్):** మహిళల భద్రతలో విశాఖ అగ్రస్థానంలో ఉన్నట్లు ఇటీవల సర్వేలో తేలిందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. వివిధ వ్యాపార ఆలోచనలతో యువత ముందుకొచ్చిందని అన్నారు. విశాఖలో అద్భుత వాతావరణం ఉందని, సముద్రం, అందమైన కొండలు ఉన్నాయని, అరకు కాఫీ కూడా చాలా ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. 1991 లో పివి నరసింహరావు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని, రెండో తరం సంస్కరణలను తాను తీసుకువచ్చానని చెప్పారు. ఎపికి చెందిన ఆర్థిక మంత్రి దేశ పురోగతిలో తన వంతు పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని ప్రధాని మోడీ 75 వ జన్మదిన శుభాకాంక్షలు చంద్రబాబు తెలియజేశారు. ప్రధాని మోడీ దేశానికి అతి పెద్ద ఆస్తి అని ప్రశంసించారు. గత నాయకులు టెలికామ్ రంగంలో సంస్కరణలు చేపట్టలేదని, వాజ్ పేయి హయాంలో టెలికామ్ రంగంలో సంస్కరణలు మొదలయ్యాయని పేర్కొన్నారు. మౌలిక సౌకర్యాల రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని,

...మిగతా 2లో



### తిరుమల బ్రహ్మోత్సవాలు.. సీఎంకు టీటీడీ ఆహ్వానం

ఏపీ సీఎం చంద్రబాబును టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కలిశారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సీఎంకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వేదపండితులు చంద్రబాబుకు వేదాశీర్వచనం చేశారు. బ్రహ్మోత్సవాలకు తిరుమలలో చేపడుతున్న ఏర్పాట్లపై బీఆర్ నాయుడుతో సీఎం మాట్లాడారు. టీటీడీ తరఫు చేస్తున్న ఏర్పాట్ల వివరాలను టీటీడీ ఛైర్మన్ వివరించారు.

# 140 కోట్ల మందికి ప్రయోజనం కలిగేలా జిఎస్టీ




- ముఖ్యంగా వ్యవసాయరంగంపై భారీ ఓదార్పు
- ఉప్పులు, పప్పులు,సబ్బులవంటి నిత్యావసరాల ధరలు తగ్గుదల
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

**విశాఖపట్నం,(మనం న్యూస్):** దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే విధంగా జీఎస్టీపై పెద్ద నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈనెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. విశాఖపట్నంలోని మధురవాడలో జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయరంగానికి ఎంతో మేలు చేకూర నుందని అన్నారు. రైతులకు మేలు చేసే విషయంలో నష్టమైనా ఫర్వాలేదని ప్రధాని మోడీ పట్టుబట్టారని అన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో జీఎస్టీ ప్రయోజనాలు చేకూరాయి. నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించాం. 12 శాతంలో ఉండే వస్తువులు దాదాపు 99 శాతం 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చాం. 28 శాతం శ్లాబ్‌లో ఉండే సిమెంట్ సహా 90 శాతం వస్తువులు 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చాం. 2017కు ముందు 17 రకాల పన్నులు ఉండేవి.. వాటిపై 8 సెస్సులు

...మిగతా 2లో

## జిఎస్టీ రెండు శ్లాబులకు కుదింపు

### సాహసోపేత నిర్ణయమన్న కేశవ్

**విశాఖపట్నం,(మనం న్యూస్):** జీఎస్టీ సంస్కరణల మీద ప్రధాని మోడీ ప్రకటన చేసిన నెల రోజుల వ్యవధిలోనే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దాన్ని సుసాధ్యం చేసిందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సంస్కరణలను అన్ని పార్టీలు ముక్తకంఠంతో ఆమోదించడం సక్సెస్ కి ఉదాహరణ అన్నారు. రెండు స్లాబ్స్ విధానం అమలు చేయడం ఈజీ వ్యవహారం కాదు.. దాని వెనుక విస్తృతమైన కృషి దాగి ఉందన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ టిపికల్ ఇండియన్ మదర్ అని ప్రసంశించారు. ఎక్కడ ఖర్చు పెట్టాలో.. ఎక్కడ నియంత్రించాలో తెలిసిన సీతారామన్ అద్భుతమైన పద్ధతిని ప్రతిపాదించి అమలు చేస్తున్నారని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల

...మిగతా 2లో

# స్టడీ సర్కిళ్ల ద్వారా బీసీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ

### భవిష్యత్తులో బీసీ స్టడీ సర్కిళ్లు బలోపేతం

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,(మనం న్యూస్):** బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా బీసీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ ఇచ్చామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం నాడు మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 1674 మందికి బీసీ స్టడీ సర్కిళ్లలో ఆఫ్ లైన్‌లో, 4770 మందికి ఆన్ లైన్ ద్వారా శిక్షణ ఇచ్చామని తెలిపారు. మొత్తం 6470 మందికి బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చామన్నారు. డీఎస్సీలో 246 మంది అభ్యర్థులు డీఎస్సీ ద్వారా టీ-చర్లుగా ఎంపికయ్యారన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, ఆర్ఆర్బీకి ఉచిత కోచింగ్

...మిగతా 2లో

# 15 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

### చంద్రబాబు కృషి వల్లనేపెట్టుబడుల రాక

### యూకే బిజినెస్ ఫోరమ్ కార్యక్రమంలో లోకేశ్



**లండన్,(మనం న్యూస్):** స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను చేతల్లో చూపిస్తున్నామని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యూకేలో బిజినెస్ ఫోరమ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు వల్లే 15 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. క్వాంటమ్ వ్యాలీ, డేటా సిటీలతో ఏపీ రూపురేఖలు మారిపోతాయన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రతిబంధకంగా ఉన్న నిబంధనలను సవరిస్తున్నట్లు- వివరించారు. భారతదేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను ఆర్సెలార్ మిత్తల్ సంస్థ

...మిగతా 2లో

# నేటినుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులతో సమీక్షించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- వైకాపా ఎమ్మెల్యేలు సభకు రావాలని సూచన

**అమరావతి,(మనం న్యూస్):** రాష్ట్ర నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:00 గంటలకు శాసనసభ, 10:00 గంటలకు శాసన మండలి సమావేశాలు మొదలవుతాయి. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి చీఫ్ సెక్రటరీ , డీజీపీతో పాటు- ఇతర కీలక అధికారులు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాలకు పటిష్ట భద్రతపై చర్చించారు. ఉభయ సభలు ప్రశ్నోత్తరాలతో ప్రారంభం కానున్నాయి. ప్రజలకు

...మిగతా 2లో

## లండన్‌లో ట్రంప్.. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫొటో ప్రదర్శన

**లండన్, సెప్టెంబర్ 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ యూకే పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో ట్రంప్‌నకు అక్కడ చేదు అనుభవం ఎదురైంది. అధ్యక్షుడి రాకకు నిరసనగా.. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్ కలిసి ఉన్న ఫొటోలను కొందరు వ్యక్తులు ప్రదర్శించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ట్రంప్, ఆయన సతీమణి మెలానియా లండన్‌కు చేరుకున్నారు. వీరికి బ్రిటన్ రాజు చార్లెస్ ఆతిథ్యం ఇవ్వనున్నారు. రాయల్ విండ్‌సర్ కోటలో వీరు బస చేయనున్నారు. ఈ భవనంపైనే ట్రంప్, ఎప్‌స్టీన్ కలిసి ఉన్న ఫొటోలతో పాటు.. ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన వీడియోలను కొందరు ప్రదర్శించారు. అధ్యక్షుడి రాకకు నిరసనగానే ఇలా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో వెంటనే స్పందించిన అధికారులు ఆ ప్రదర్శనను నిలిపివేశారు. దీనికి సంబంధించి

...మిగతా 2లో

## మిథున్ రెడ్డిని కస్టడీకి అప్పగించండి

### పిటిషన్ దాఖలు చేసిన సిట్



**అమరావతి,(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఏ4, ఎంపీ మిథున్ రెడ్డిని తమ కస్టడీకి అప్పగించాలంటూ బుధవారం కోర్టులో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారించేందుకు ఎంపీ మిథున్ రెడ్డిని తమకు ఐదు రోజుల పాటు- అప్పగించాలంటూ సిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే మద్యం కుంభకోణంలో అరెస్టయిన ఎంపీ మిథున్ రెడ్డి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఐఏఎస్ విశ్రాంత అధికారి

...మిగతా 2లో

# సేఫ్టీ పరికరాలు, వస్తువులు పంపిణీ చేసిన మంత్రి కొల్లు

**మచిలీపట్నం సెప్టెంబర్ 17: (మనం న్యూస్):** పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తూ ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ప్రశంసించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి 6 లక్షల రూపాయల విలువచేసే కొబ్బరి నూనె, డిటర్జెంట్ సబ్బులు, చెప్పులు అప్రాన్ లు కలిగిన సంచులను పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు చేసే సేవలు అమూల్యమని, ప్రజలందరూ ఆరోగ్యంగా తిరుగుతున్నారంటే అందుకు ప్రధాన కారణం పారిశుధ్య కార్మికులు నిరంతరం వీధులు, మురికి కాలువలు శుభ్రపరచడం వల్లనే అన్నారు. కార్మికులు తెల్లవారుజాముననే లేచి, విధులన్నీ ఊడ్చి చెత్తాచెదారం తొలగించి, ప్రోగు చేసి డంపింగ్ యార్డ్ కు తరలించడం జరుగుతుందన్నారు. గతంలో కార్మికుల న్యాయమైన కోరికలు తీర్చేందుకు చేసే పోరాటంలో తాము కూడా భాగస్వాములయ్యామన్నారు. అందుకే వారి పట్ల ఎంతో శ్రద్ధతో వేతనాలను

...మిగతా 2లో



# మమ్మల్ని జంతువుల్లా ట్రీట్ చేసిండ్రు

### జార్జియాలో భారతీయులపై అమానవీయ ప్రవర్తన

### ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్టు పెట్టిన మహిళ



**హైదరాబాద్, సెప్టెంబర్ 17:** ఈ-వీసాలు, సరైన పత్రాలతో జార్జియాకు వెళ్లిన తమ పట్ల అక్కడి అధికారులు అమానవీయంగా ప్రవర్తించారని ఓ భారతీయ మహిళ ఆరోపించారు. జంతువుల్లా వీధుల్లో కూర్చోబెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టా గ్రామ్‌లో పెట్టిన పోస్టు వైరల్ అవుతోంది. ధ్రువీ పటేల్ అనే మహిళ ఈ పోస్టు పెట్టారు. అర్మేనియాలోని సడఖ్లో సరిహద్దు నుంచి జార్జియాలోకి వెళ్తున్న 56 మంది భారతీయులను అక్కడి అధికారులు ఇబ్బందులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. తమ వద్ద అన్ని పత్రాలు ఉన్నప్పటికీ.. 5 గంటలకు పైగా గడ్డ కట్టే చలిలో ఉంచారన్నారు. ఆ సమయంలో ఆహారం ఇవ్వకపోగా.. కనీసం టాయిలెట్ కు వెళ్లేందుకు కూడా అనుమతించలేదని పేర్కొన్నారు. 2 గంటలపాటు తమ పాస్ పోర్టులను తీసుకుని జంతువుల్లా ఫుట్ పాత్‌లపై కూచోబెట్టారని అందులో రాశారు. నేరస్థుల్లా తమను వీడియోలు కూడా తీసినట్లు తెలిపారు. మా వద్ద ఉన్న డాక్యుమెంట్స్ ను పూర్తిగా పరిశీలించకుండానే.. వీసాలు తప్పుగా

...మిగతా 2లో

# రాష్ట్ర వ్యాప్తంగా రక్త దాన శిబిరాలు

### ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్

**విజయవాడసెంట్రల్, సెప్టెంబర్ 17 (మనంన్యూస్):** భారతీయజనతాపార్టీ యువమోర్చా మరియు బిజెపి ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కార్యాలయంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మాధవ్ మరియు

...మిగతా 2లో



# జిఎస్టీ రెండు శ్లాబులకు కుదింపు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. అయితే, విభిన్నపార్టీలు రాజకీయ వైరుధ్యాలతో పని చేస్తున్నప్పటికీ, జీఎస్టీ సంస్కరణల విషయంలో భిన్నాభిప్రాయాలు లేకుండా వ్యవహరించారు అని పయ్యావుల కేశవ్ చెప్పుకొచ్చారు. ఫైనాన్స్ మంత్రి దగ్గర అందరూ లాబీయింగ్ చేస్తే పేద వాళ్ల కోసం లాబీయింగ్ చేసిన ఆర్థిక మంత్రి నిర్మలమ్మ.. ఎన్నికల ముందు రేట్లు- తగ్గించడం చూస్తాం.. కానీ, దేశం కోసం పని చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వం నిత్యం సంస్కరణ విధానంలో పని చేస్తుంది అన్నారు. ఖాఃఊ లకు క్రెడిట్ గ్యారెంటీస్ సహా కీలక విధానాలు అమలు చేస్తున్నారు అని ఆర్థిక మంత్రి కేశవ్ తెలిపారు.

# స్టడీ సర్కిళ్ల ద్వారా బీసీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చామని చెప్పారు. భవిష్యత్తులో బీసీ స్టడీ సర్కిళ్లు బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు ఉచిత శిక్షణతో ఉద్యోగాలు వచ్చేలా చేసినందుకు బీసీ సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డు వచ్చిందన్నారు. ఈనెల 20న బీసీ వెల్ఫేర్ శాఖ అధికారులు అవార్డు తీసుకోబోతున్నారన్నారు. జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు రావడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని మంత్రి వెల్లడించారు.

నా పేరుతో మార్ఫింగ్ పెట్టి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతల చీప్ ట్రిక్స్‌ను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. నాపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు చేశా. వైసీపీ నేతలు చీప్‌గా వ్యవహరించడాన్ని ఆపాలన్నారు.. పీపీ విధానంలో ప్రభుత్వం నిర్మిస్తుంటే... ప్రైవేటు-పరం అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. మెడికల్ కళాశాలలపై చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. తిరుమలలో దర్శనాల పేరిట వైసీపీ నేత రోజా అక్రమంగా దందాలన్నీ చర్చించేందుకు సిద్ధం. ఐదేళ్లపాటు- వైసీపీ నేత రోజా చేసిన అవినీతి అక్రమాలపై చర్చకు సిద్ధం. ఈ సారైనా పులివెందుల ఎమ్మెల్యే అసెంబ్లీకి రావాలి. వైసీపీ నేతలంతా కలసి పులివెందుల ఎమ్మెల్యేని అసెంబ్లీకి పంపాలి. పులివెందుల ఎమ్మెల్యే అసెంబ్లీకి వస్తే మాట్లాడేందుకు మైక్ ఇస్తాం. ఏ అంశంపైనా సరే అసెంబ్లీలో

చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. యూరియా, మెడికల్ కళాశాలలు, వివేకా గొడ్డలి వేటు-పై చర్చించేందుకు మేము సిద్ధం. సూపర్ సిక్స్ అమలు చేసి సూపర్ హిట్ చేశాం. మళ్లీ అమరావతి రాజధాని అంటూ మోసం చేసేందుకు వైసీపీ వారు డ్రామా ఆడుతున్నారు. తిరుపతిలో పదేళ్లుగా విగ్రహం అక్కడే ఉందని తెలిసినా వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారని అంటూ మంత్రి సవిత ఫైర్ అయ్యారు.

# నేటినుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన కీలక అంశాలపై సభ్యులు ప్రశ్నలు వేస్తారు. ప్రశ్నోత్తరాల అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమవుతుంది. సీఎస్, డీజీపీ, ఉన్నతాధికారులతో సమీక్ష ముగిసిన అనంతరం సభ్యులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు- చేయాలని అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఇదిలావుంటే ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు. తమ తమ ప్రాంత సమస్యల పరిష్కారానికి ఇదో సదావకాశంగా ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు.

అయ్యన్నపాత్రుడుగా నాకు గౌరవం ఇమ్మనట్లేదు, కానీ సభాపతి స్థానానికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత వైసీపీ ఎమ్మెల్యేలకు ఉందని గుర్తుచేశారు. సభకు వస్తే ప్రజా సమస్యలు చర్చించేందుకు అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా తిరగటం మంచిది కాదని హెచ్చరించారు. ఉదయం బీఏసీ సమావేశంలో సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై నిర్ణయిస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సభ్యులకు సమాధానాలు సకాలంలో చేరాలని అధికారుల్ని ఆదేశించి నట్లు అయ్యన్నపాత్రుడు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు- చేయాలని సూచించారు. ప్రశ్నోత్తరాల్లో సభ్యులకు సమాధానాలు సకాలంలో చేరాలని ఆదేశించారు.

వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా తిరగటం మంచిది కాదని స్పీకర్ అన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా రక్త దాన శిబిరాలు

(మొదటి పేజీ తరువాయి)



ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ప్రారంభించారు. మాధవ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రపంచంలో ఒక శక్తి వంతమైన నేత ప్రపంచ దేశాలు నరేంద్ర మోడీ ని వారి దేశాలకు ఆహ్వానించడానికి పోటీ పడుతున్నారు. అటువంటి నేత జన్మదినోత్సవం సందర్భంగా రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేయడమైనది.అదేవిధంగా మెడికల్ క్యాంపు లు,పరిసరాల పరిశుభ్రత వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాధవ్ వివరించారు. కార్యక్రమంలో భారతీయజనతాపార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ తోపాటు వంద మంది కార్యకర్తలు రక్తదానం చేసారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రామ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, బిజెపి స్టేట్ ఆఫీస్ ఇంఛార్జి ఉప్పలపాటి శ్రీ నివాస్ రాజు భగవాన్ జీ,చైతన్య శర్మ,షేక్ బాజి,కిలారు దిలీప్ ,బొడ్డు నాగలక్ష్మి, చిగురుపాటిలక్ష్మి, రత్నకుమారి, షర్మిళ, పిట్టలగోవిందు, కోలపల్లి గణేష్ ,పైలా సోమినాయుడు, పైలా సురేష్ పుల్లర్ కాట్ దిలీప్ ,నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతలో విశాఖ అగ్రస్థానం

(మొదటి పేజీ తరువాయి)

ఐటి రంగంలో భారత్ చాలా బలంగా ఉందని అన్నారు. గణితం, ఆంగ్లంలో ముందుండడం కలిసి వస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు.2047 నాటికి వికసిత్ భారత్ సాధించడానికి, పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కంకణం కట్టుకుని పనిచేస్తున్నారని చంద్రబాబు నాయుడు అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ఆబిడ్డల ఆరోగ్యం ఏ విధంగా కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు- తెలిపారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో భారత్ ను 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో ఆర్థిక వ్యవస్థకు తీసుకువచ్చారని... 2047 నాటికి నెంబర్ వన్ గా తయారవుతామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ ఫైనాన్స్ మినిస్టర్ మహిళలే అని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య సమస్యతో కుటుంబం మొత్తం మీద భారం పడుతుందని.. అందుకోసం ప్రతి కుటుంబానికీ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకు వస్తున్నామన్నారు. ఆడబిడ్డలు ఆరోగ్యం కోసం ఈ మెడికల్ క్యాంప్ ప్రారంభించామన్నారు. హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీ- కోసం పని చేస్తున్నామన్నారు. విశాఖ ప్రజలు మంచి మనషులని చంద్రబాబు కితాబునిచ్చారు. వైజాగ్ సేఫెస్ట్ సిటీ- ఇన్ ఇండియా అని.. దేశంలో మంచి సిటీగా మారుతుందని పేర్కొన్నారు. మహిళలు ప్రతి రోజు ఒక అర గంట .. మన కోసం కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఆయిల్, షుగర్, ఉప్పు తగ్గిస్తే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఆరోగ్యం కోసం రూ.20వేల కోట్ల ఖర్చు పెడుతున్నామని.. అందరికీ ఇన్సూరెన్స్ ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పుకొచ్చారు. బిల్‌గేట్ ఫౌండేషన్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో సంజీవని కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రాబాబు నాయుడు వెల్లడించారు.

# 140 కోట్ల మందికి ప్రయోజనం కలిగేలా జిఎస్టీ

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఉండేవి. ఉదాహరణకు 2017కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేది. అన్నింటినీ కలిపి దేశవ్యాప్తంగా ఒకే పన్ను.. నాలుగు శ్లాబ్‌ల రూపంలో తీసుకొచ్చిందే జీఎస్టీ అని అన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ప్రజలపై భారం తగ్గించేందుకే జీఎస్టీ తీసుకొచ్చాం. పాలు, పెరుగు సహా పలు నిత్యావసరాలను 5 శాతం శ్లాబ్ నుంచి సున్నా శాతానికి తీసుకొచ్చాం. మధ్యతరగతికి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నాం. కారు, ఫ్రిజ్, ఏసీని 28 శాతం నుంచి 18 శాతానికి తీసుకొచ్చాం. ఆత్మనిర్భర్ భారత్‌కు జీఎస్టీ నూతన సంస్కరణలు పెద్ద ఊతం. మహిళల ఆరోగ్యం కోసం శానిటరీ న్యాప్‌కిన్స్‌పై పన్నును సున్నా చేశాం. యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉన్న వస్తువులను ఇప్పుడు 5 శాతానికి తెచ్చాం. సరళతరమైన పన్ను విధానాన్ని తీసుకురాలేని వాళ్లు ఇప్పుడు విమర్శలు చేస్తారా? గతంలో 65 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండేవాళ్లు. ఈ 8 ఏళ్లలో ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరిందని నిర్మలా సీతారామన్ వివరించారు. ఇప్పటికే అనేక రంగాల్లో జిఎస్టి ప్రయోజనాలు చేకూరాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జిఎస్టి స్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించామని అన్నారు.అన్నింటినీ కలిపి ఒకే పన్ను, నాలుగు స్లాబ్ లుగా తీసుకొచ్చిందే జిఎస్టి అని తెలియజేశారు. 2017 కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేదని, 2017 కు ముందు 65 లక్షల మంది పన్ను చెల్లించే వారని అన్నారు. ఈ 8 ఏళ్లలో పన్ను చెల్లింపు దారులు 1.51 కోట్లకు చేరారని, 2018 లో జిఎస్టి ద్వారా రూ. 7.19 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని కొనియాడారు. 2025 లో జిఎస్టి ద్వారా రూ. 22.08 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, ప్రజలపై భారం తగ్గించేందుకే జిఎస్టి తీసుకొచ్చామని అన్నారు. వెన్న, నెయ్యి, వంటపాత్రలను 12 నుంచి 5 శాతానికి, పప్పులు, చింతపండు, ఉప్పును తెచ్చామని, హెయిర్ ఆయిల్, షాంపును 18 నుంచి 5 శాతానికి తీసుకొచ్చామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మధ్యతరగతి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నామని, కారు, ఫ్రిజ్, ఎసిని 28 శాతానికి తీసుకొచ్చామని చెప్పారు. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్పులు చేశామని, పురుగులమందులు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను దృష్టిలో పెట్టు-కున్నామని అన్నారు. సులభమైన పన్ను విధానం తేలేని వారు ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. యూపిఏ హయాంలో 30 శాతం పన్ను ఉన్న వాటిని 5 శాతానికి తెచ్చామని, మహిళల శానిటరీ న్యాప్ కిన్స్ పై పూర్తిగా పన్ను తొలగించామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నవరాత్రులు ప్రారంభం నుంచే కొత్త జీఎస్టీ విధానం పని చేస్తుంది అని తెలియజేసింది. విస్తృతమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు అమలు చేయడం జరుగుతుంది అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించింది. గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అక్షేపించినా వినియోగదారులకు అంతిమంగా మేలు జరుగుతుంది.. వన్ నేషన్- వన్ ట్యాక్స్ విధానానికి జీఎస్టీ కౌన్సిల్ ఫెడరల్ వ్యవస్థగా మారింది.. న్యూజెన్ ట్యాక్స్ వల్ల రెండ లక్షల కోట్ల వరకు ప్రజల చేతుల్లో నగదు ఉంటుంది.. పప్పులు, ఉప్పులు సహా అన్నీ 5 శాతం పరిధిలోకి వచ్చేశాయ్ అని వెల్లడించింది. స్థూలంగా మధ్య తరగతికి మేలు చేసే విధంగా రూపొందించాం.. పేద, మధ్య తరగతి, రైతులు, దేశానికి ఉపయోగమైన సెక్టార్స్ ను పిల్లర్స్ గా పెట్టు-కుని జీఎస్టీ రూపకల్పన జరిగింది అని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ పేర్కొనింది. ఇక, 144 వందే భారత్ రైళ్లు, 60 శాతం కంటే ఎక్కువ హైవేలు, విమానాశ్రయాలు రెట్టింపుతో పాటు- సంక్షేమ పథకాలు, రక్షణ వ్యవస్థ బలోపేతం ఇవన్నీ జీఎస్టీ సొమ్ముతోనే చేశామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మన డబ్బుని సరిగ్గా వినియోగించే ప్రభుత్వం మనకి కావాలి.. డీబీటీల ద్వారా రూ.3 లక్షల కోట్లు- బోగస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ఆదా చేశాం.. జీఎస్టీ 2.0 తీసుకొస్తే ఎనిమిదేళ్లు ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేసినట్లు- ఒప్పుకుంటున్నారా అని ప్రతిపక్షాలు మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లు జీఎస్టీని తీసుకురాకుండా కాలయాపన చేసిన యూపీఏ ప్రభుత్వానికి జీఎస్టీపై మాట్లాడే అర్హత లేదు అన్నారు. వాళ్ల గురించి మాట్లాడాలంటే బూతులొస్తున్నాయి.. రాజకీయంగా బదులిచ్చేందుకు సమయం ఉంది.. ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్లపై యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉంటే ఇప్పుడు 18 శాతానికి తగ్గిందని నిర్మలా సీతారామన్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మమ్మల్ని జంతువుల్లా ట్రీట్ చేసిండ్రు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని చెప్పారని వెల్లడించారు. భారతీయుల పట్ల జార్జియా అధికారుల తీరు సిగ్గుచేటంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోస్టుకు ప్రధాని మోడీ, విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ లను ట్యాగ్ చేశారు. ఈ ఘటనపై మన ప్రభుత్వం స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, వారు ఇంకా స్పందించలేదు.

# మిథున్ రెడ్డిని కస్టడీకి అప్పగించండి

(మొదటి పేజీ తరువాయి)

ధనుంజయ్ రెడ్డి, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలతోపాటు- గోవిందప్ప బాలాజీలకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి మాత్రం బెయిల్ మంజూరు కాలేదు. అలాగే ఎంపీగా ఉన్న తాను.. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తన ఓటు- హక్కు వినియోగించుకోవాలంటూ బెయిల్ కోసం మిథున్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయనకు సైతం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు- హక్కు వినియోగించుకుని.. సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోవాలంటూ ఎంపీ మిథున్ రెడ్డికి కోర్టు స్పష్టం చేసింది. ఇంకో వైపు మద్యం కుంభకోణంలో భాగంగా భారీగా నగదుతోపాటు- ఆస్తులను సైతం ప్రభుత్వ అధికారులు జప్తు చేసిన సంగతి తెలిసిందే.

# 15 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)




ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు- చేయబోతోంది. నవంబర్‌లో దీని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దేశంలో అతిపెద్ద డేటా సెంటర్ త్వరలో విశాఖపట్నానికి రాబోతోంది. టీసీఎస్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను రాష్ట్రానికి రప్పించేందుకు మేం ఎకరా 99 పైసలకే భూములు ఇచ్చాం. మా వద్ద కొత్తతరం యువ నాయకత్వం ఉంది. మొత్తం శాసనసభలో 50 శాతం తొలిసారి గెలిచినవారున్నారు. మంత్రివర్గంలోని 25 మందిలో 17 మంది కొత్తవారే. వారందరికీ స్టార్టప్ మైండ్‌సెట్ ఉంది. ఆంధ్రప్రదేశ్ ఒక స్టార్టప్ స్టేట్. మేమంతా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న తపన, పట్టుదలతో పనిచేస్తున్నాం అన్నారు. దక్షిణాసియాలో తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతికి రాబోతోంది. ప్రధాని మోదీ క్వాంటమ్ మిషన్‌ను ముందుండి నడిపించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. దీని ద్వారా అమరావతిలో అద్భుతమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు- కాబోతోంది. విశాఖలో డేటా సిటీ- నిర్మాణం వల్ల అక్కడ కేబుల్స్ ల్యాండ్ అవుతాయి. ముంబయి కన్నా రెట్టింపు సామర్థ్యంతో 1.5 గిగావాట్ల డేటా సెంటర్స్ విశాఖకు రాబోతున్నాయి. రాబోయే మూడేళ్లలో అవి పూర్తవుతాయి. ఇది ఆరంభం మాత్రమే.. ఇంకా ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలతో చర్చలు జరుపుతున్నామని లోకేశ్ వివరించారు.

# డ్రైవర్ 'లెస్' డెలివరీ వెహికిల్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 17:** అబుదాబిలోని మస్దార్ నగరంలో డ్రైవర్ రహిత వాహనాలు నడిపేందుకు అవకాశం కల్పించారు. దీనిని పబ్లిక్-ప్రైవేట్ రంగాలు కలిసి తొలుత ఏర్పాటు చేశాయి. దీనిలో స్థానిక టెక్నాలజీ, లాజిస్టిక్స్ సంస్థలు భాగస్వాములయ్యాయి. ఎమిరేట్స్‌లో కత్రిమ మేధతో పనిచేసే లాజిస్టిక్స్ రంగం అభివద్ధి వైపు వేసిన తొలి అడుగుగా దీనిని భావించవచ్చు. అబుదాబి మొబిలిటీగా పేరున్న ది ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్ (ఐటీసీ) దీనిని తొలిసారి పైలట్ ప్రోగ్రామ్‌గా మొదలుపెట్టింది.

స్థిరమైన పట్టణాభివద్ధి సాధిస్తున్న నగరంగా మస్దార్ సిటీకి పేరుంది.

ఇక కే2 సంస్థకు అనుబంధంగా ఉన్న ఆటోగో అనే కంపెనీ ఈ వాహనాన్ని అభివద్ధి చేసింది. వీటిల్లో డ్రైవర్లు ఉండరు. కేవలం అత్యాధునిక స్మార్ట్ మొబిలిటీ వ్యవస్థ ఆధారంగా ఇది పనిచేస్తుంది. ఈ క్రమంలో సెల్ఫ్‌డ్రైవింగ్ వాహనాలకు తొలి లైసెన్స్ ప్లేట్‌ను కూడా జారీ చేశారు. కేవలం నగర పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణించేలా వీటిని రూపొందించారు. ఇవి ట్రాఫిక్ చట్టాలు, నిబంధనలు ఫాలో అవుతాయి.

# అమెరికా నేతలు అవినీతి పరులు

## పాక్ మంత్రి షాకింగ్ కామెంట్లు



**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 17:** ఓ పక్క పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా పర్యటనకు రంగం సిద్ధం చేసుకుంటుంటే.. మరో వైపు ఆయన మంత్రి వర్గ సభ్యులు మాత్రం అగ్రరాజ్యాన్ని ఇరుకున పడేస్తున్నారు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికా నేతలు అవినీతిపరులని.. వారు ఇజ్రాయెల్ నుంచి లంచాలు స్వీకరిస్తున్నారని ఆరోపించారు.

పాకిస్థాన్‌నకు చెందిన జియో టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ ''మేము లంచాలు స్వీకరించావని తీవ్ర అపవాదులు ఎదుర్కొన్నాం. కానీ, అమెరికా రాజకీయ నాయకులు ఇజ్రాయెల్ నుంచి బహిరంగంగానే లంచాలు తీసుకున్నారు. అదే నేను లంచం స్వీకరించాల్సి వస్తే.. ఎక్కడో చాటుగా తీసుకుంటాను. మేము నిందలు మోశాం కానీ.. వారు బహిరంగంగానే చేస్తున్నారు'' అని అన్నారు. అమెరికా మిలిటరీ అధికారులు, ప్రతినిధులసభ సభ్యులు, ఉన్నత స్థాయి పాలకులు తాము ఇజ్రాయెల్ నుంచి నిధులు అందుకున్నట్లు అంగీకరించారన్నారు. మరో వైపు పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఏకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకే షాక్ ఇచ్చారు. భారత్ ఎప్పుడూ మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదన్నారు. ఆయన అల్-జజీరాతో మాట్లాడుతూ ''మూడో పక్షం పాత్ర ఉన్నా మేము ఏమీ అనుకోం. ఇది ద్వైపాక్షిక అంశమే అని భారత్ పేర్కొంది. సరే ఏ చర్చలు జరిగినా.. ఉగ్రవాదం, వాణిజ్యం, జమ్ముకశ్మీర్‌పై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది'' అని పేర్కొన్నారు. ''మే 10వ తేదీన సీజ్ ఫైర్ ఆఫర్ వచ్చిన వేళ.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్-పాక్ చర్చలు తటస్థ వేదికగా జరుగుతాయని చెప్పారు.

# సేఫ్టీ పరికరాలు, వస్తువులు పంపిణీ చేసిన మంత్రి కొల్లు

(మొదటి పేజీ తరువాయి)



సకాలంలో చెల్లిస్తున్నామన్నారు. ఇదివరకు లక్ష టన్నులకు పైగా చెత్త పేరుకుని పోయి కొండలాగా తయారయిందన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 2 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆ డంపింగ్ యార్డ్ ను చూసి చెత్తాచెదారాలను తొలగించాలని సూచించారన్నారు. వారి సూచనల మేరకు ఒక్కొక్కటి 1.15 కోట్ల రూపాయల వ్యయంతో రెండు కాంప్యాక్టర్లను కొనుగోలు చేసి చెత్తను తొలగించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇటీవల పురపాలక శాఖ మంత్రి మచిలీపట్నంకు వచ్చిన సందర్భంలో డంపింగ్ యార్డ్ ను చూసి అవసరమైతే మరొక కాంప్యాక్టర్ ను కూడా మంజూరు చేస్తామని చెప్పారన్నారు.

ప్రతిరోజు సేకరించే చెత్త 70 టన్నుల వరకు ఉంటుందని, మొత్తం మూడు కంపాక్టర్లతో ఏ రోజుకు ఆ రోజు చెత్తను పూర్తిగా తొలగించుకొని నగరంలో చెత్త సమస్య లేకుండా తొలగిపోతుందన్నారు.

అధునాతన పరికరాలు వస్తున్నాయని వాటితో కూడా త్వరితగతిన చెత్తను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.


నగరంలో చాలా చోట్ల మురికి కాలువలు పూడిపోయి ఉన్నాయని, మొత్తం మీద 122 చోట్ల కాలువలు మధ్యలో ఆగిపోయాయని, పూర్తిస్థాయిలో వాటి నిర్మాణం చేపట్టుటకు 130 కోట్ల రూపాయల బడ్జెట్ అవసరం ఉందని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ ప్రస్తావించారని ఇందుకోసం తొలి దశలో 13 కోట్ల రూపాయలు బడ్జెట్ నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఆ నిధులతో త్వరలో మురికినీటి కాలువ నిర్మాణ పనులు చేపడతామన్నారు. మురికి నీటిని శుద్ధి చేసి శుద్ధ జలం గా తయారు చేసే సివరేజ్ ప్లాంట్లను 73 కోట్ల రూపాయలతో నిర్మించుటకు టెండర్లు మొదటి దశలో పిలిచామని, సరిగా లేకపోవడంతో వాటిని రద్దు పరచామని, మరల టెండర్లు పిలుస్తున్నామన్నారు.

నగరం అభివృద్ధికి అన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. పాలకవర్గ సభ్యులు బడ్జెట్ను కూడా పెట్టుకోలేని పరిస్థితిలో ఉన్నారని దీంతో రాష్ట్ర ప్రభుత్వంచే బడ్జెట్ ఆమోదింప చేయించి నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు.

నగరంలో నూటికి నూరు శాతం మురుగునీటి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఆ సమయంలో చాలామందికి ఇబ్బందులు కలుగుతున్నందున విద్యుత్ నిలిపివేయకుండా అందరికీ మంచి నీరు సరఫరా అయ్యే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఏమైనా కార్మికుల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మునిసిపల్ సిబ్బంది, పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ఈసారి దసరా స్పెషల్ సిందూర్ బొమ్మల కొలువు

**కోయంబత్తూర్, సెప్టెంబర్ 17:** దేవీ నవరాత్రుల సందర్భంగా బొమ్మ కొలువులు పెట్టడం, వాటి కోసం ఇంట్లో జరిగే ఆనందాల హడావుడి మనందరికీ అనుభవేకవేద్యమే. ఈ రోజుల్లో అమ్మవారిని పూజించడంతోబాటు దైవానికి ప్రతీకలుగా భావించే బొమ్మల్ని అందంగా అమరుస్తారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో కోయంబత్తూర్‌లో ప్రత్యేకంగా తయారయ్యే గోలు బొమ్మల అమ్మకాలు పెరిగాయి. అయితే ఈసారి తయారీదారులు ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని.. త్రివిధ దళాల కమాండర్లు, సైనికుల ఆకృతిలో బొమ్మలను తీర్చిదిద్దారు. ఈ ప్రత్యేకత బాగా ప్రజలను ఆకట్టుకుంటోంది. దాంతో ఈసారి బొమ్మల కొలువు కోసం వాటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రతిఏటా గోలు పూజ (బొమ్మల కొలువు) కోసం ఏటా కొత్తరకం ఆకృతుల్లో బొమ్మలు సిద్ధమవుతుంటాయి.



శరవణకుమార్ అనే తయారీదారుడు మాట్లాడుతూ..'' ప్రతి ఏటా నవరాత్రి సమయంలో గోలు బొమ్మల అమ్మకాలు పెరుగుతాయి. 20 ఏళ్ల నుంచి నేను ఈ వ్యాపారంలో ఉన్నాను. ఈసారి ప్రహ్లాదుడి కథను గుర్తుచేసుకునేలా అలాగే ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా భారత సైన్యానికి చెందిన త్రివిధ దళాల కమాండర్ల బొమ్మలను రూపొందించారు'' అని వెల్లడించారు.

# ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

- కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి రాయులు




**తిరుపతి,సెప్టెంబర్ 17,మనం న్యూస్ :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75 వ జన్మదినం వేడుకలను తిరుపతిలో కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి. రాయులు ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్ కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం ఎదుట జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలలో బిజెపి నాయకులు అజయ్ కుమార్ టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి తిరుపతి జిల్లా లెప్రసీ మరియు ఎయిడ్స్ ట్యూబర్ సిస్ అధికారిని డాక్టర్ శైలజ ఆసుపత్రి టీబి సిబ్బంది లోకేష్ బాబు ముఖర్జీ ధర్, మహర్షి కైవరాచి కీకా పెరియ, బండి మధుసూదన్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి, మిఠాయిలను అందరికీ పంచిపెట్టారు.

అనంతరం వంద మంది టీబీ పేషెంట్లకు టీబీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతి బిజెపి నాయకులు టీటీడీ పాలక మండలి సభ్యులు జి. భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరుపుకోవాలని అందులోనూ నేను పాల్గొనడం చాలా ఆనందదాయకంగా ఉందని, మన దేశాన్ని అన్ని దేశాలతో అన్ని రంగాలలో పోటీపడే విధంగా అభివృద్ధి పరంగా తీసుకెళ్తున్నారని ప్రధానమంత్రి దేశానికి చేసిన అభివృద్ధి పనులను తెలుపుతూ అలాగే కస్తూరిబా కేంద్ర గాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి రాయులు ఇలాంటి కార్యక్రమాలు చేయడం అలాగే అన్నదాన కార్యక్రమాలు చేయడం పేదవారికి బట్టలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ పిసి రాములు ను ఈ సందర్భంగా కొనియాడారు.

ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి సి రాయులు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని అన్ని రంగాలలోనూ ముందుకు తీసుకెళ్తున్నారని అందుకు ప్రధాని మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని, అలాగే టిబి ని దేశమంతటా నివారించాలని ప్రధాని చేస్తున్న ప్రయత్నంలో భాగంగా నేడు ప్రధాన జన్మదిన సందర్భంగా వందమంది టీబి పేషెంట్లకు టీవీ కిట్లను పేషెంట్లకు అందజేశారు. అలాగే ప్రధానమంత్రి ఆరోగ్యంగా ఉండాలని దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అలాగే అజయ్ కుమార్ మాట్లాడుతూ కస్తూరిబా కేంద్ర గాంధీ ట్రస్ట్ చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలును అభినందిస్తూ అలాగే ఈరోజు టీబీ పేషెంట్లకు టీబీ కిట్లను పంపిణీ చేస్తున్న కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ట్రస్ట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో మాజీ మంత్రి రోజా



**తిరుమల,సెప్టెంబరు 17, మనం న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని బుధవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి ఆర్కే రోజా, అలనాటి సినీనటి రవళి కలిసి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్సు నుండి ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# జగన్ మెప్పు కోసం కరుణాకర్రెడ్డి కుప్పిగంతులు




- అరెస్ట్ అవ్వడం కోసం భూమన తపన
- తండ్రిని అరెస్టు చేయించడానికి అభినయ్రెడ్డి కుతూహలం
- సానుభూతి కోసం నాటకాలాడుతున్న భూమన కుటుంబం

**తిరుపతి,సెప్టెంబర్ 17,మనం న్యూస్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైసీపీ నేతలైన చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్రెడ్డిల మాదిరిగానే అరెస్ట్ అయ్యి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మెప్పు పొందేందుకు మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తపన పడుతున్నారు. తన తండ్రిని అరెస్టు చేయించేందుకు కుమారుడు అభినయ్ రెడ్డి కూడా కుతూహలంగా ఉన్నారు. సానుభూతి కోసం నాటకాలు ఆడినంతమాత్రాన భూమన కుటుంబాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులు లేవు అని రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నర్సింహ యాదవ్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సి.మునికృష్ణ, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ఏపీయూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.

తిరుపతి ప్రెస్క్లబ్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భూమన అభినయ్రెడ్డి సోషల్ మీడియా వేదికగా చేస్తున్న రాద్ధాంతంపై మాట్లాడారు. తొలుత నర్సింహ యాదవ్ మాట్లాడుతూ భూమన కుటుంబం అరెస్టు అవ్వాలని ఉద్దేశపూర్వకంగానే సోషల్ మీడియాలో రాద్ధాంతం చేశారన్నారు. శనీశ్వరుని విగ్రహం వద్దకు వెళ్లి మహావిష్ణువు విగ్రహానికి అపచారం జరిగిందని, తిరుమల ప్రతిష్టతను దెబ్బతీస్తున్నారని విషప్రచారం చేశారన్నారు.

ఇందుకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నమే టీటీడీ పాలకమండలి క్షేత్రస్థాయి వివరణ ఇస్తుండగానే భూమన అక్రమ అరెస్టు అంటూ దొంగ నాటకాలకు తెరలేపారన్నారు. దానికి అనుగుణంగా మంగళవారం సాయంత్రం 7గంటలకు ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. ఇదంతా కూడా కేవలం జగన్రెడ్డి మన్ననలు పొందేందుకే అని విశదీకరించారు.

**శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ**

ప్రజల్లో సానుభూతి కోసమే భూమన అభినయ్రెడ్డి సోషల్ మీడియాలో విషప్రచారాలు చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మీరు చేసిన అక్రమాలు, అన్యాయాలపై విజిలెన్స్ విచారణ పూర్తయిందనేది వాస్తవమన్నారు. ఈ విషయంలో అన్ని పార్టీల నాయకులు కూడా భూమనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆరా తీస్తున్నారన్నారు. కక్షపూరితంగా కూటమి ప్రభుత్వం ఎవరినీ ఇబ్బంది పెట్టదని, ఈ విషయంలో చట్టపరంగా భూమన కరుణాకర్ రెడ్డి పై చర్యలుంటాయని అన్నారు.

భక్తుల కానుకలు, టీటీడీ నిధులను కాజేసిన చేసిన మిమ్మల్ని ఎందుకు వదిలిపెట్టాలని, మీ అవినీతిని వీటన్నింటికీ సంబంధించి అరెస్టు తప్పదన్నారు. ఇదిలా ఉంటే నిన్న శనీశ్వరుని విగ్రహం వద్ద జరిగిన విషయంపై ఎక్కడా కూడా ఎఫ్ఐఆర్ నమోదవ్వకపోయినా తన తండ్రిని అక్రమంగా అరెస్టు చేసేస్తున్నారంటూ భూమన అభినయ్రెడ్డి చేసిన ప్రచారం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల్లో సానుభూతి పొందేందుకు పోస్టర్లు కూడా సిద్ధం చేయడం విపరీత పోకడలకు నిదర్శమన్నారు. తండ్రిని అరెస్టు చేయించేందుకు కుమారుడికి ఎందుకు అంత కంగారో తెలియడం తెలియడం లేదన్నారు. తండ్రిని అరెస్టు చేసేస్తే సానుభూతి వస్తుందని భ్రమలో ఉన్నారన్నారు. తిరుపతిలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత భూమన కుటుంబానిదన్నారు. శనీశ్వరుని విగ్రహాన్ని మహావిష్ణువు విగ్రహం అని చూపడం, తిరుమలలో నెయ్యిని కల్తీకి పాల్పడటం, రూ.600 కోట్లతో పనులకు టెండర్లు పిలిచి మీకు నచ్చినవారికిచ్చి కమీషన్లు తీసుకోవడం, స్మార్ట్ సిటీ నిధులు, టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడటం వాస్తవమా కాదా అని ప్రశ్నించారు.

వీటన్నింటికీ మీరు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. అంతేకానీ అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తే ఊరుకోవడానికి గత టీడీపీ ప్రభుత్వం కాదని, అన్నింటికీ లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ ఎన్.మహేష్ యాదవ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డిసెంబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు



**తిరుమల, సెప్టెంబర్ 17,మనం న్యూస్ :** డిసెంబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన డిసెంబర్ నెల కోటాను సెప్టెంబర్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం సెప్టెంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చు. అంగ ప్రదక్షిణ టోకెన్లను కూడా ఈ నెల నుండి ఆన్ లైన్ లో ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా జారీ చేయనున్నారు. ఈ టికెట్లు పొందిన వారు సెప్టెంబర్ 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను సెప్టెంబర్ 22న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది.వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను సెప్టెంబర్ 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది. డిసెంబర్ నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను సెప్టెంబర్ 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను సెప్టెంబర్ 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్లైన్లో విడుదల చేస్తారు. వెబ్సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

# శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ వరాహ మహాదేశికన్ స్వామీజీకి టీటీడీ పెద్ద మర్యాద

తిరుమల,సెప్టెంబర్ 17,మనం న్యూస్: కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తమిళనాడు రాష్ట్రంకు చెందిన శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ వరాహ మహాదేశికన్ స్వామీజీ గురువారం ఉదయం స్వామివారి నైవేద్య విరామసమయం అనంతరం స్వామివారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



ముందుగా ఆలయం మహాద్వారం వద్దకు చేరుకున్న శ్రీశ్రీశ్రీ వరాహ మహాదేశికన్ స్వామీజీకి టీటీడీ ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీ అధికారులు ఆలయ పెద్ద మర్యాదలతో ఇస్తీకపాల్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ముఖ్య నిఘా మరియు భద్రతా అధికారి కే.వి. మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ బాలసుబ్రమణ్యం, విజిలెన్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత మన జీవనవిధానంలో భాగం కావాలి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- పరిసరాల పరిశుభ్రత అందరి ధ్యేయం కావాలి
- కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి,సెప్టెంబర్ 17,మనం న్యూస్ :** పరిశుభ్రత మన జీవనవిధానంలో భాగం కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా కారకంబాడి రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కాలనీలోని పార్క్ నందు పరిశుభ్రత చేపట్టి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య లు ప్రారంభించారు. పార్కులో మొక్కలను ఎమ్మెల్యే, కమిషనర్ నాటారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 లో భాగంగా స్వచ్ఛత హి సేవ ను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. వ్యక్తిగత శుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని ఆయన తెలిపారు. స్వచ్ఛత అంటే కేవలం చెత్తను తొలగించడం కాదు మన ఆలోచనల్లో, మన జీవన విధానంలో పరిశుభ్రతను అలవాటు చేసుకోవడం అని ఆయన చెప్పారు. పుణ్యక్షేత్రమైన తిరుపతికి నిత్యం వేలాది మంది భక్తులు వచ్చి పోతున్నందున నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. స్వచ్ఛమైన పరిసరాలు ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఆయన చెబుతూ ప్రతి ఒక్కరు చెట్లు నాటి సంరక్షించాలని కోరారు.

**నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ**

స్వచ్ఛ త హి సేవ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం మూడు థీమ్ లతో కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. మొదటగా నిరంతరం శుభ్రం చేయని స్థలాలను సుందరంగా తీర్చిదిద్దడం, రెండవది సఫాయి మిత్ర సురక్ష లో భాగంగా పదిరోజుల పాటు పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాలు నిర్వహించడం, మూడవది గ్రీన్ ఉత్సవ్ లో భాగంగా ఈ నెల 20 వ తేదీ మూడవ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పలు ప్రాంతాలను శుభ్రం చేసి మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. రెండు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందరూ తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రీనర్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, ఏపీ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ ఆదం సుధాకర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల్లో భద్రతపై టీటీడీ విజిలెన్స్, పోలీసుల సమన్వయ సమావేశం

**తిరుమల, సెప్టెంబర్ 17,మనం న్యూస్ :** సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2వ తేది వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ ఆధ్వర్యంలో టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసు, టీటీడీ అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవన్లో బుధవారం



సాయంత్రం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్మెంట్, శ్రీవారి వాహన సేవలలో వినియోగించే వివిధ వాహనాల పటిష్టత, అనుమానస్పద వ్యక్తులపై నిఘా వంటి అంశాలపై చర్చించారు.

సమావేశంలోని ముఖ్యాంశాలు:

- ట్రాఫిక్ అంతరాయం లేకుండా తిరుమల మరియు తిరుపతిలలో పార్కింగ్ లు ఏర్పాటు-
- ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు.
- ఎలక్ట్రికల్ కటౌట్లు, ఎల్ఈడీ స్క్రీన్ల పటిష్టత తనిఖీ.
- బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే వాహన సేవలకు వినియోగించే వాహనాల స్థిరత్వం మరియు దృఢత్వం పరిశీలన.
- బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు విచ్చేసే కార్మికులు, ఆర్టీసీ డ్రైవర్ల గుర్తింపు తనిఖీ.
- అధిక రద్దీ నేపథ్యంలో ముందస్తుగా అదనపు వాహనాల పార్కింగ్ ఏర్పాటు పై ప్రణాళిక
- టీటీడీ నిఘా, జిల్లా పోలీసు, టిటిడి అధికారుల సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

ఈ సమావేశంలో టీటీడీ సిఈ సత్య నారాయణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, టీటీడీ విభాగాధిపతులు, జిల్లా పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

- ఆహ్వానించిన టీటీడీ చైర్మన్, ఈవో



**తిరుమల,సెప్టెంబరు 17,మనం న్యూస్ :** ఈ నెల 24వ తేదీ నుండి ప్రారంభం కానున్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో అనిల్కుమార్ సింఘాల్, బోర్డు సభ్యురాలు జానకి దేవి, అడిషనల్ ఈవో సి.హెచ్ వెంకయ్య చౌదరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. బుధవారం ఉదయం విజయవాడ వెలగపూడిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో వారు ముఖ్యమంత్రిని కలసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్, టీటీడీ ఈవో, అడిషనల్ ఈవో ముఖ్యమంత్రికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేయగా వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను చైర్మన్, ఈవో ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఆలయం బొక్కసం ఇంచార్జ్ గురురాజ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సూర్యప్రభ వాహనం ట్రయల్ రన్

**తిరుమల,సెప్టెంబర్ 17, మనం న్యూస్ :** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వినియోగించే సూర్యప్రభ వాహనం పటిష్టతను పరిశీలించేందుకు బుధవారం టీటీడీ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ వాహన సేవ సమయంలో వాహనబేరర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పాల్గొన్నారు.



## మట్టి మనుషుల యుద్ధం!

రాజ్యంతో
చేసిన యుద్ధాలకు
అధికారుల లాంఛనాలు అక్కర్లేదు!
గతాన్ని ఏమార్చి
పండగ చేసుకోవడం
నిజమైన దేశభక్తి కాదు!
రాచిరంపాన పెట్టిన రాజుది
ఏ మతం అయితే ఏంది
రాలిపోయే వరకు రాయి విసరడమే!
చేతికి అందిందే ఆయుధం
కారం జల్లి రోకలి ఎత్తడమే
విముక్తి గీతానికి నాంది!
సకల జనులు
సంగతేందో తేల్చిన యుద్ధమే
తొలి తెలంగాణ విముక్తి సమరం!
రాజెంత బలవంతుడైన
అంతా ఏకమైతే
పదహారు బండ్లల్ల పారిపోవడమే చరిత్ర!
కల్పిత కథనాలతో
త్యాగాలను విడగొట్టలేము
పేదల పోరుకు కలంకమద్దలేము!
వైషమ్యాలు లేని యుద్ధం నిజం
చలి చీమల చేత
బలమైన సర్పపు చావు నిజం!
నా తెలంగాణ
ఎప్పటికీ పోరుగడ్డ
నిజాయితీకి అసలైన అడ్డ!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# ప్రజాభిప్రాయం పట్టని వారికి పతనమే?



**ఏప్రిల్ 2022...**

శ్రీలంకలో కలకలం. ఏకంగా అధ్యక్షుడి ఇంటి మీద దాడి. ఆనాటి మంత్రులు, అధికారుల మీద విరుచుకుపడ్డ యువత. చివరకు రాజీనామా చేసి తన ప్యాలెస్‌ను, దేశాన్ని విడిచిపెట్టిపోయిన అధ్యక్షుడు.

**ఆగస్టు 2024**

బంగ్లాదేశ్‌లో అలజడి. మిన్నంటిన ఆందోళనలతో చేదాటిపోయిన పరిస్థితులు. పీఎం ఆఫీసు, ఇల్లు సహా ఏదీ వదిలిపెట్టలేదు. అధికారులు, మంత్రులను సైతం విడిచిపెట్టకుండా దాడులు జరిగాయి. చివరకు ప్రధానమంత్రి ఉన్న పళంగా దేశం విడిచిపోవాల్సి వచ్చింది.

**సెప్టెంబర్ 2025**

నేపాల్ యువత రోడ్డెక్కారు. జెన్ జెడ్ ఉవ్వెత్తున ఎగిశారు. ఆగ్రహావేశాల తాకిడికి నేపాల్ ప్రధాని ఇల్లు మాత్రమే కాకుండా పార్లమెంట్ భవనం కూడా మంటల్లో చిక్కుకుంది. మంత్రులను నడిరోడ్డు మీద ఈడ్చుకుంటూ కొట్టారు. పలువురు అధికారుల మీద దాడులు జరిగాయి. మూకుమ్మడి దాడులతో దేశ రాజధాని నగరంతో పాటుగా అనేక ప్రాంతాలు అదుపు తప్పాయి. ఆర్మీ అధికారులు అండగా ఉండి, పలువురు ఉన్నత స్థాయి నేతల ప్రాణాలు కాపాడాల్సి వచ్చింది. శ్రీలంకలో అదుపు తప్పిన ద్రవ్యోల్బణం అగ్గిపుట్టించింది. బంగ్లాదేశ్‌లో నిరుద్యోగం నిప్పు రాజేసింది. నేపాల్‌లో అవినీతి, అక్రమాలు సహించ లేని సెక్షన్ చెలరేగింది. ఇవన్నీ ట్రిగ్గర్ పాయింట్స్‌గా ఉన్నాయి. సోషల్ మీడియా నియంత్రించారని నేపాల్‌లో ఒక్కసారిగా జెన్ జెడ్ యువత వీరంగం చేసిందని చెబుతున్నప్పటికీ దానికి ముందు కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు అందుకు ఊతమిచ్చాయి. రాజకీయ వ్యవస్థలోని లోపాలు అందుకు ప్రధాన కారణమవుతున్నాయి. పాలకులు, వారి విధానాలతో విసుగు చెందిన తర్వాత ఇక వీధి పోరాటాలకు సైతం వెనుకాడేది లేదన్నట్టుగా కనిపిస్తోంది. ఈ మూడు దేశాల్లో జరిగిన ఉద్యమాలు ఏదో లక్ష్యంతో సాగినవి కాదు. ఏదో ఓ సంస్థ నడిపినవి అంత కన్నా కాదు. రాజకీయ పార్టీల నేతృత్వం అసలు లేదు. ఎంతో కాలం పాటు ఓపిక పట్టలేని యువత ఒక్కసారిగా కదులుతున్న వైనం ఈ అనుభవాలు కళ్లెదురుగా చాటుతున్నాయి.

ప్రజలను పాలకులు తక్కువ అంచనా వేస్తే ఏమవుతుందో ఆయా దేశాలు చెబుతున్నాయి. మీడియా సహాయంతో, ఇతర వ్యవస్థల అండ చూసుకుని ఏం చేసినా ఫర్వాలేదనుకుంటే ఓ స్థాయి వరకే ఓపిక పడతారు తప్ప దీర్ఘకాలం సాధ్యం కాదని చాటుతున్న సంకేతమిది. వ్యవస్థలను ఆధారంగా చేసుకుని ప్రశ్నించే ప్రతీ గొంతు నొక్కేశామని అధికారంలో ఉన్న వాళ్లు ఆనందిస్తే అది తాత్కాలికమేనని చెబుతున్న సత్యం. ఆయా దేశాల్లో 90 శాతం మంది మనుగడ కోసం అను నిత్యం పోరాడక తప్పని పరిస్థితుల్లో మిగిలిన 10 శాతం పెత్తనం చేస్తూ సర్వం అనుభవించడాన్ని సామాన్యులు సహించలేకపోతున్నట్టు కనిపిస్తోంది. ఆర్థిక అసమానతలు హద్దుల్లేకుండా పెరిగి పోయిన సమాజంలో అన్ని రంగాలను గుప్పిట్లో పెట్టుకున్న వారిని చూస్తే జనం సహించబోరని చాటుతున్న వాస్తవం. అందుకే ప్రజలు తమంతట తాముగానే తిరగబడ్డారు. ప్రభుత్వ అధినేతలను పారద్రోలారు. తక్షణమే తమకు దొరికిన ప్రత్యామ్నాయాన్ని వెదుక్కుంటున్నారు. ఎంతో కొంత ఉపశమనం దక్కుతుందని ఎదురు చూస్తున్నారు. సమూల మార్పులు కాకపోయినా ఆయా దేశాల్లో ప్రజల తిరుగుబాటు చూసిన తర్వాత కొత్తగా గద్దెనెక్కిన ప్రభుత్వాలు కొంత జాగ్రత్తగా సాగాల్సి ఉంటుంది. ఎంతో కొంత మేర ప్రజానుకూల విధానాలకు పూనుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక, రాజకీయ అధికారం కొంతమంది గుప్పిట్లో ఉండిపోతున్న తీరుని ఏదో మేర సడలించాల్సి ఉంటుంది. లేదంటే ఆయా దేశాలు తీవ్ర అస్థిరతను ఎదుర్కోక తప్పని స్థితి దాపురిస్తోంది. ఈ మూడు దేశాల్లో ప్రస్తుతం శ్రీలంక మాత్రమే తిరుగుబాటు తర్వాత ఎన్నికలు నిర్వహించుకుంది. బంగ్లాదేశ్, నేపాల్ మాత్రం తాత్కాలిక ప్రభుత్వాలతో నడుస్తున్నాయి. రాజకీయంగా స్థిరత్వం ఏదేశానికయినా అత్యంత కీలకం కాబట్టి అక్కడ కూడా రాజకీయ రంగంలోనూ మార్పులకు శ్రీకారం చుడుతూ ఎన్నికలు నిర్వహించడం అత్యవసరం. ఎన్నికలు కాకుండా అడ్డదారుల్లో అధికారం చేపట్టిన వారు ప్రజాభిప్రాయానికి ఏమేరకు ప్రాధాన్యత నిస్తారన్నది ప్రశ్నార్థకం. ఆరంభంలో కొంత అణిగిమణిగి సాగినా క్రమంగా అధికారం రుచిమరిగిన తర్వాత మళ్లీ పూర్వపు పోకడలు పునరావృతమయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ప్రజాభిప్రాయానికి తగ్గట్టుగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మాత్రమే ఎక్కడైనా పురోగతికి తోడ్పడతాయి. అందుకు తగ్గట్టుగా ఆ దేశాలు కూడా వ్యవహరించాల్సి ఉంటుంది.

అదే సమయంలో సరిహద్దు దేశాల్లో రాజకీయ, సామాజిక అస్థిరత భారతదేశానికి కూడా అంత శ్రేయస్కరం కాదు. సరిహద్దుల్లో చెలరేగే మంటల సెగ ఇక్కడ కూడా తగలక మానదు. కాబట్టి చిన్న దేశాలు చితికిపోకుండా, తిరిగి కోలుకుని ప్రజాస్వామ్య పునరుద్ధరణ వైపు సాగేందుకు అనుగుణంగా చేయందించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆ దేశాల్లో పరిస్థితులు సర్దుమణిగే వరకూ సరిహద్దుల్లో మరింత జాగ్రత్తలు అనుసరించక తప్పదు. ఇప్పటికే ఇండియాలోని అనేక ప్రాంతాలతో వివాహ సంబంధాలు, బంధుత్వాలు కలిగిన నేపాలీలు సరిహద్దులు దాటుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వాటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఇండియా ప్రభుత్వం కూడా పగడ్బందీగా వ్యవహరించాల్సి ఉంటుంది.

- ఐనం ప్రసాద్
9848928787



# సైన్యాధిపతుల వ్యూహ రచన అద్భుతం



భారతదేశ చరిత్రలో సెప్టెంబర్ 17 1948 చిరస్మరణీయమైనదినం. భారత్ సేనాధి పతుల వ్యూహరచన చాతుర్యానికి, సేనల అసమాన పరాక్రమానికి ప్రతిష్ట చేకూర్చిన రోజు. హైదరాబాద్‌పై భారత ప్రభుత్వ పోలీసు చర్య విజయ వంతంగా ముగిసిన సంఘటనకు సాక్ష్యం అయిన రోజు. దక్షిణ ప్రాంత భారత సర్వ సేనాని లెఫ్టినెంట్ జనరల్ మహారాజా రాజేంద్ర సింహ్‌జీ సాటిలేని మేటి వ్యూహ రచనకు నిలువు టద్దంగా నిలిచిన రోజు. సెప్టెంబర్ 13 వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు భారత సేనలు సంస్థానం నలువైపుల నుండి 'చలో సికింద్రాబాద్' అని ముందు అడుగు వేశాయి. సికింద్రాబాద్ చేరవలసిన ప్రధాన సేనావాహిని మేజర్ జనరల్ జయంత్ నాథ్ చౌదరి నాయకత్వంలో షోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాదుకు బయల్దేరింది. ఈ సేనలో ఒక దళం నల్‌దుర్గ్ నుండి ఉత్తరంగా జాల్నా మీదికి సాగింది. దక్షిణాన హోస్పేట వద్ద, మైసూర్ సేనకు సంబంధించిన బ్రిగేడియర్ బాల్, మధ్య ప్రాంతం డిఐజి పార్థసారథి అయ్యంగార్ నేతృత్వంలో మైసూర్ సేన, కొంత మద్రాస్ ప్రత్యేక పోలీసు దళం, మరికొంత మునీరాబాద్ వద్ద తుంగభద్రపై గల వంతెనను స్వాధీన పరచుకొని ముందుకు సాగాయి. కొంచెం తూర్పుగా కర్నూల్ వద్ద మైసూర్ అశ్వికదళం జాతీయ పోలీసు బలగం తుంగభద్ర రైలు వంతెన స్వాధీన పరచుకొని గద్వాల్ దిశగా సాగాయి. విజయవాడ వద్ద నుండి బ్రిగేడియర్ మదన్‌సింగ్ ఆధ్వర్యంలో ఒక సేనాదళం ఉత్తర ప్రాంత డిఐజి సుబ్బరాయన్ ఆధ్వర్యంలో కొంత పోలీసు బలగంతో బయలు దేరాయి. సేవాదళం రెండు భాగాలుగా విడివడి... ఒకటి రైలు మార్గం వెంట ఖమ్మం మీదుగా వరంగల్, రెండవది సూర్యాపేట మీదుగా సికింద్రాబాద్ లక్ష్యాలుగా పురోగమించాయి. ఉత్తరాన కొంత సేన, కొంత పోలీసు బలగం బాలార్షను ఆక్రమించాయి. ఆ సమీపంలో గోదావరిపై గల రైలు వంతెనకు ప్రమాదం లేకుండా చేశాయి.

పడమరగా కానేర్గాం వద్ద నుండి కొంత పోలీసు బృందం, హింగోలి దిశగా బయలు దేరగా, వాయవ్యంగా తాల్వాద్ నుండి ఒక సైనిక దళం ఔరంగాబాద్‌కు సాగింది. షోలాపూర్, విజయవాడ, తాల్వాద్ నుండి బయల్దేరిన ప్రధాన సేనదళాలు... ఎలాంటి ప్రతిఘటనలు కేంద్రీకృతం కాకుండా చేసేందుకు, స్వాధీ నమైన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు, సంఘ విద్రోహ శక్తులను మట్టుపెట్టే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. హోస్పేట, కర్నూలు, విజయవాడ నుండి బయలు దేరిన బలగాలు మద్రాస్ ప్రాంత సేనాని మేజర్ జనరల్ రుద్ర పర్యవేక్షణ కిందపని చేశాయి. ఈ దండయాత్రలో సిక్కులు గూర్ఖాలు మద్రాసు బొంబాయి తదితర పోలీసులు పాల్గొన్నారు. సేనాధిపతులలో ఇరువురు ఆంగ్లో-ఇండియన్లు కూడా ఉన్నారు. 13వ తేదీ సూర్యోదయం వేళ భారత వైమానిక దళాలు విజయవాడ ప్రాంతం నుండి ఎయిర్ వైస్ మార్షల్ ముఖర్జీ నాయకత్వంలో, నిజాం సంస్థానంలోని వరంగల్ బీదర్, ఔరంగబాద్ విమానాశ్రయాలను ఆనవాళ్లు లేకుండా చేశాయి. వాస్తవానికి భారత సేనలు సంస్థానం లోకి తరలి వస్తున్న విషయం 13వ తేదీ ఉదయం 11గంటలకు కానీ బయటకు తెలియనే లేదు. ఢిల్లీలో ఈ విషయాన్ని భారత ప్రభుత్వం బహిర్గతం చేసింది. భారత సైన్యం మెరుపు వేగంతో అన్నివైపుల నుండి సికింద్రాబాద్ వైపు, హైదరాబాద్ వైపు బలగాలు అవిశ్రాంతంగా ముందుకు సాగాయి. 14న మధిర అలంపూరు, 15న వనపర్తి, దౌలతాబాద్, సూర్యాపేట, ఖమ్మం మెట్టు, హోమ్నాబాదు, ఔరంగాబాదు భారత సేనల వశమైనాయి. హోమ్నాబాదు పతనంతో, భారత సేనలు సికింద్రాబాదుకు 10 మైళ్ళ పరిధిలోకి వచ్చాయి. అలా ముందుకు వెళ్లి ఆ రాత్రికి జహీరాబాద్ చేరాయి. నిజాం నవాబుకు దిక్కు తోచని స్థితి ఎదురయింది. ఇలాంటి స్థితిలో జార్జి రాజుకు, ట్రూమన్‌కు విజ్ఞప్తులు పంపుకున్నాడు. అయినా ఎవరూపట్టించుకున్న దాఖలాలు లేవు. 16వ తేదీన వరంగల్, బీదర్, జాల్నా, సిర్వ్యాగు, నారేటుపల్లి, సదాశివపేట సేనల వశమయ్యాయి. ఆరోజున అటు సోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాద్ వెళ్తున్న దళము, ఇటు విజయవాడ నుండి సూర్యాపేట సికింద్రాబాద్ రహదారిపై వెళుతున్న దళము నువ్వా నేనా అంటూ పోటీపడి ముందుకు సాగాయి.

17వ తేదీన హింగోలి సేనల వశమైంది. ప్రధాన దళాలు రెండు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల శివార్లకు చేరుకున్నాయి. దక్షిణ ప్రాంత సర్వ సేనాధిపతి రాజేంద్ర సింహ్‌జీ నిజాంను ఉద్దేశించి 'ఇక లాభం లేదు. లొంగిపోయి అనవసర ప్రాణ నష్టం లేకుండా చూసుకోండి' అంటూ హితవు పలికారు. ఇక గత్యంతరం లేదని గ్రహించిన 17వ తేదీ సాయంత్రమే దాసోహం అన్నాడు. పోలీసు చర్యలో భాగంగా నలువైపులా నుంచి వస్తున్న భారత బలగాలను చూసి నిజాం కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చి భారత ప్రతినిధి కె.ఎం.మున్షీని కలిశాడు. లొంగుబాటుకు మించిన తరుణోపాయం లేదని మున్షీ చెప్పడంతో నిజాం ఒప్పుకోక తప్పలేదు.

1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైంది. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే.ఎన్.చౌదరి, సైనిక గవర్నర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎం.కె.వెల్లోడి ముఖ్యమంత్రిగా నియుక్తులైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు, భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, 50 లక్షల రూపాయల భరణం చెల్లింపునకు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగేవిధంగా ప్రభుత్వం అంగీకరించింది.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సురక్షిత నీటితోనే ప్రజారోగ్యం



జీవులకు ప్రాణాధారం నీరు మాత్రమే. నీరు ఒక సార్వత్రిక ద్రావణి. జలం లేకుండా జీవనం సాగదు. ప్రకృతి ప్రసాదించిన సహజ అమూల్య వనరులుగా నీటి నిల్వలు కలిపిస్తాయి. నదులు, సరస్సులు, చెరువులు, వాగులు, సముద్రాలు, భూగర్భజలాలు లాంటి పలు నీటి వనరులు సకల ప్రాణికోటికి అందుబాటులో ఉన్నాయి. రసాయనశాస్త్ర పరంగా నీటిని త్రిపరమాణుక విజాతీయ అణువుగా నామకరణం చేశారు. సురక్షిత మంచి నీరు అందించినపుడు మాత్రమే పలు వ్యాధులకు అడ్డుకట్టపడుతుంది. కలుషిత నీరు తాగితే కలరా, డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, హెపటైటిస్, మలేరియాసిస్ లాంటి తీవ్రమైన వ్యాధులు సోకుతాయి. మానవాళి ఎదుర్కొంటున్న 80 శాతం రోగాలకు కలుషిత తాగు నీరే కారణమని తెలుస్తున్నది. ప్రపంచ మరణాల్లో 5 శాతం వరకు కలుషిత నీటి వల్ల కలుగుతున్నట్లు నిర్ధారించారు. భారత్లో 70 మిలియన్ల మరణాలు డయేరియా కారణంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు జనాభాలో ఒక్కరు సురక్షిత నీటికి దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.



**ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం-2025**

భూమండల ఉపరితలంపై 71 శాతం నీరు ఆక్రమించి ఉంది. ప్రపంచంలోనే నీటిలో 3 శాతం మాత్రమే సురక్షిత మంచి నీరుగా అందుబాటులో ఉన్నది. మిగిలిన 97 శాతం నీరు సముద్రాలు, మంచు కొండల రూపంలోనే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత నీరు అందడం లేదు. పరిసరాల పరిశుభ్రతకు కూడా నీటి అవసరం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా తాగు, సాదు నీటి కొరతలను తట్టుకోవడానికి, అందుబాటులో ఉన్న నీటిని కలుషితం కాకుండా చూసుకోవడానికి, తరుచుగా నీటి నాణ్యతలను తెలుసుకోవడానికి సంబంధించిన అవగాహన కల్పించడానికి 2003 నుంచి అమెరికాకు చెందిన మంచి నీటి సంస్థ చొరవతో ప్రతి ఏట 18 సెప్టెంబర్ రోజున ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం (వరల్ వాటర్ మానిటరింగ్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. మనకు స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను తరుచుగా పరీక్షించుకోవడం, నీటి నాణ్యత పట్ల అవగాహన కలిగి ఉండడం, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం తప్పనిసరి అవుతున్నది. నీటి నాణ్యతను విచ్ఛిన్నం చేయడానికి పురుగు మందులు, రసాయన ఎరువులు, మురుగు నీరు, రసాయన వ్యర్థాలు, పరిశ్రమల వ్యర్థాలు, మానవ ప్రమేయం వ్యర్థాలతో నీరు కలుషితం కావడం, చమురు లీక్ కావడం లాంటివి దోహదపడుతున్నాయి. వీటికి తోడుగా ఉష్ణోగ్రత, ఆమ్లత్వం, కరిగి ఉన్న ఆక్సిజన్, క్లారిటీ లాంటివి కూడా పనిచేస్తాయి. నీటిని శుద్ధి చేయడానికి వడపోత, స్వేదనం, మరిగించడం, క్లోరినేషన్ లాంటివి దోహదపడతాయి.

నేడు అభివృద్ధి చెందుతున్న అల్పాదాయ ప్రపంచదేశాల్లో ఇథియోపియా, ఉగాండా, సోమాలియా, నైజీరియా, పాకిస్థాన్, మొజాంబిక్ లాంటి దేశాల్లో అధిక జనాభాకు సురక్షిత తాగు నీరు అందడం లేదు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరుచుగా నీటి నాణ్యతను పరీక్షించుకోవడం, సురక్షిత తాగు నీటి అవసరాలను అవగాహన పరచడం, సభలు/ సమావేశాలు నిర్వహించి నీటి పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని వివరించడంతో లాంటి కార్యక్రమాలను తేపట్టాలి. నీటి రవాణాలో లీకేజీలను అడ్డుకోవడం, నల్లా నీరు వృధా కాకుండా చూసుకోవడం, సూక్ష్మ సేద్యం చేయడం, స్ప్రింక్లర్లను వాడడం, నీటి పొదుపు పట్ల విద్యార్థులకు అవగాహన కలిపించడం లాంటివి వివరించాలి. గ్రామీణ భారతంలో 83 శాతం, పట్టణ జనాభాలో 91 శాతం జనాభాకు సురక్షిత నీరు లభిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత వంటి కారణాలు కూడా సురక్షిత నీటి లభ్యతకు ప్రతిబంధకాలుగా పని చేస్తున్నాయి. విద్య, వైద్యం, సురక్షిత తాగు నీరు లభించడం ఒక ప్రాథమిక హక్కు అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 3 బిలియన్ల ప్రజలు అంతర్జాతీయ నీటి వనరులపైన మాత్రమే ఆధారపడుతున్నట్లు, అందులో కేవలం 24 దేశాలు మాత్రమే ఒక అంతర్జాతీయ ఒప్పందాలను చేసుకున్నాయని తెలుస్తున్నది. తాగు, సాగు నీటి లభ్యతపై ప్రపంచ శాంతి ఆధారపడి ఉన్నది. నీటి కోసం వివిధ పౌర సమూహాలు, దేశాలు ఘర్షణ పడుతున్నాయి. సహజ నీటి వనరులను సక్రమంగా వాడుకోని యెడల కలుషిత జలాలు ఏరులైపారి రోగాలను వ్యాపింపజేస్తాయి. నేటి పౌర సమాజం నీటిని పొదుపుగా వాడుకుంటూ, కలుషితం కాకుండా చూసుకుంటూ ఆయురారోగ్యాలతో మనుగడ సాగిద్దాం, నీటి ఆధార అనారోగ్యాలకు అడ్డుకట్ట వేద్దాం.

(18 సెప్టెంబర్ ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం సందర్భంగా)

- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వీక్షణం సాహితీ గవాక్షం(కాలిఫోర్నియా)

వీక్షణం సాహితీ గవాక్షం 13వ వార్షికోత్సవ సమావేశం సెప్టెంబర్ 13,2025న కాలిఫోర్నియాలోని ఫ్రీమౌంట్ లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథులుగా శ్రీమతి ఎల్.విజయలక్ష్మి (అలనాటి మేటి నటీమణి), శ్రీ సురజిత్ కుమార్ దే దత్తా, డా. కాత్యాయనీ విద్మహే, శ్రీ జి. వల్లీశ్వర్, శ్రీమతి కె.వరలక్ష్మి గార్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీక్షణం ప్రత్యేక సంకలనం, వీక్షణం 13 సంవత్సరాల సమావేశాల ప్రత్యేక సంచికల ఆవిష్కరణ ప్రఖ్యాత టాక్ షో వ్యాఖ్యాత, కౌముది సంపాదకులు శ్రీ కిరణ్ ప్రభ, శ్రీమతి కాంతికిరణ్, వీక్షణం అధ్యక్షులు డా.కె.గీతామాధవి గార్ల చేతుల మీదుగా జరిగింది. కవిసమ్మేళనాన్ని శ్రీ రావు తల్లాప్రగడ గారు నిర్వహించారు.

ముందుగా వీక్షణం వ్యవస్థాపక అధ్యక్షులు డా.కె.గీతా మాధవి గారు సభకు ఆహ్వానం పలుకుతూ వీక్షణం ప్రారంభమైన తొలిరోజు నించీ విశేషాంశాల్ని తలుచుకున్నారు. 2012 సెప్టెంబర్ లో కాలిఫోర్నియాలోని బేఏరియాలో వీక్షణం సాహితీ వేదిక అతి సాధారణంగా ప్రారంభమైనా, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా సమావేశాలు జరుపుకుంటూ ఉంది. శ్రీ గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్ గారు వీక్షణం భారతదేశ ప్రతినిధిగా సేవలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా గీత గారు వీక్షణానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసారు.

సభకు ఆతిథ్యం వహించిన శ్రీ సుభాష్ పెద్దు గారు, డా. వందన ఈనాటి ముఖ్య అతిథులైన శ్రీమతి ఎల్.విజయలక్ష్మి (అలనాటి మేటి నటీమణి), శ్రీ సురజిత్ కుమార్ దే దత్తా, డా. కాత్యాయనీ విద్మహే, శ్రీ జి. వల్లీశ్వర్, శ్రీమతి కె.వరలక్ష్మి గార్లను వేదికకు ఆహ్వానించారు.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, శ్రీమతి ఎల్.విజయలక్ష్మిగారి సహచరులు శ్రీ సురజిత్ కుమార్‌దే దత్తాగారు, శ్రీమతి ఎల్. విజయలక్ష్మి గార్లు మాట్లాడుతూ తమ జీవితానుభవాల్ని పంచుకున్నారు. సురజిత్ కుమార్‌దే దత్తా గారు హరిత విప్లవంలో ప్రముఖపాత్ర వహించారు. సురజిత్ కుమార్ దే దత్తా గారు అత్యంత సాధారణ జీవితాన్నించి అమెరికాలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన క్రమాన్ని, ఎల్. విజయలక్ష్మి గారు అత్యంత ప్రముఖ జీవితాన్నించి కుటుంబ జీవితానికి పరిమితమైనా, అలవోకగా జీవితాన్ని ఎన్నో కళలకు, విద్యలను నేర్చుకోవడానికి అంకితం చేసిన విధానం అందరినీ అబ్బురపరిచింది.

డా.కాత్యాయనీ విద్మహే గారు ప్రముఖ కథకురాలైన శ్రీమతి కె.వరలక్ష్మి గారి కథల్లోని విశిష్టాంశాల్ని, గ్రామీణ బహుజన జీవితాల్ని ఆవిష్కరించిన విధానాన్ని 'మంత్రసాని', 'స్వస్తి' మొదలైన కథలను విశ్లేషిస్తూ వివరించారు.

ప్రముఖ పాత్రికేయులు శ్రీ జి. వల్లీశ్వర్ గారు తమ పాత్రికేయానుభవాల్ని హాస్యస్ఫోరకంగా వివరిస్తూ ప్రసంగించారు. శ్రీ కిరణ్ ప్రభ గారు అలనాటి ప్రముఖ నటీమణి, గాయని టంగుటూరి సూర్య కుమారి గారి గురించి ప్రసంగించి సభను అలరించారు.

చివరగా శ్రీ రావు తల్లాప్రగడ గారు కవిసమ్మేళనాన్ని తన గజల్ తో శుభారంభం చేశారు. తరువాత డా.కె.గీతామాధవి గారు తమ కవిత ద్వారా వీక్షణం సుక్షణాల్ని పంచుకోగా, కృష్ణకుమార్ పిల్లలమట్టి గారు పద్య కవితని, వంశీ ప్రఖ్యా గారు కృత్రిమ మేధని గురించిన వచన కవితని, యువకవి శశి ఇంగువ అనువాద పాటని, గాయనీమణి శ్రీమతి గాయత్రి అవ్వారి గారు అద్భుత గానాన్ని వినిపించారు. అన్నిటికంటే ముఖ్యంగా ముఖ్య అతిథి శ్రీమతి ఎల్.విజయలక్ష్మి గారు కూడా తమ అద్భుత గానాన్ని వినిపించడం విశేషం.

అత్యంత ఆసక్తిదాయకంగా జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కవులు, రచయితలు, ప్రముఖులు, సాహిత్యాభిలాషులు శ్రీ చిమటా శ్రీనివాస్, శ్రీమతి పద్మజ చెంగల్వల, శ్రీమతి నీరజ కందాళ, శ్రీమతి అపర్ణ గునుపూడి, శ్రీ సుబ్బారావు గునుపూడి, శ్రీమతి ఝాన్సీ లక్ష్మి, శ్రీమతి ఉదయలక్ష్మి, శ్రీమతి సుచేత, శ్రీ ప్రసాద్ నల్లమోతు, వేమూరి వేంటేశ్వర్రావు, శ్రీమతి ఉమా వేమూరి, శ్రీ బండ్ల కోటేశ్వర రావు, శ్రీ సుబ్బారావు తల్లాప్రగడ, శ్రీ పెద్దు గోపీచంద్, శ్రీ మూర్తి అవ్వారి, శ్రీ ఇంగువ మల్లికార్జున శర్మ, శ్రీమతి ఇంగువ బాలామణి, శ్రీ రావు కాకర్లమూడి మొదలైన వారు విశేష సంఖ్యలో హాజరయ్యారు.




- పద్మజ చెంగల్వల

## నియోజకవర్గంలో నూతన కార్మిక యూనియన్ ఆవిర్భావం



జగ్గయ్యపేట, సెప్టెంబర్ 17(మనంన్యూస్): జగ్గయ్యపేట నియోజకవర్గంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని అసంఘటిత కార్మిక రంగాన్ని బలోపేతం చేయుటకు అసంఘటిత కార్మిక రంగ సమస్యల పరిష్కరించుటకు నూతనంగా సృష్టి కార్మిక సంఘంఏర్పాటు చేస్తున్నట్టు న్యాయవాది అన్నేపాగా ప్రఫుల్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. జగ్గయ్యపేట చుట్టుపక్కల పరిసర గ్రామాలలో ఉన్నటువంటి అసంఘటిత కార్మికుల యొక్క అవసరాలను దృష్టిలో పెట్టుకొని అసంఘటిత కార్మికుల హక్కులను మరియు వారి యొక్క అవసరాలను దృష్టిలో పెట్టుకొని నూతనముగా కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ పెయింటింగ్ ఎలక్ట్రిషన్ వ్యవసాయ ఉపాధి హామీ కూలీలు దుకాణాల్లో పనిచేస్తున్న గుమస్తాలు మెకానిక్ వెల్డింగ్ కార్మికులు మరియు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## జోగి రమేష్ అక్రమ అరెస్టును ఖండించిన తన్నీరు నాగేశ్వరరావు



- వైసిపి నేతలతో కలిసి జోగి రమేష్ కు సంఘీభావం తెలిపిన తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్: ఇబ్రహీంపట్నంలో దొంగ బూడిద మీద పోరాటం చేస్తున్న మాజీ మంత్రివర్యులు జోగి రమేష్ ని అక్రమంగా అరెస్టు చేశారంటూ జోగి రమేష్ అరెస్టును వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గం ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు.అక్రమ అరెస్టు చేసి భవానిపురం పోలీస్ స్టేషన్ కు తరలించగా జిల్లా వైసిపి నాయకులతో కలిసి అక్రమ అరెస్టును నిరసిస్తూ జోగి రమేష్ ను కలిసిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, ఎం.డి రుహూల్లా, నియోజకవర్గ సమన్వయకర్తలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోండి



ఉయ్యూరు సెప్టెంబర్ 17 (మనం న్యూస్): మహిళల ఆరోగ్యం మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ ను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం గండిగుంట గ్రామంలో వెల్నెస్ సెంటర్లో ( ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ ఈరోజు నుండి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు అందుబాటులో ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నూతక్కి తేజస్విని బి ఇంద్రావతి కార్యక్రమ వివరాలను తెలుపుతూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారని రక్తహీనత క్యాన్సర్ డెంటల్ కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తారని అన్నారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఓ కంతేటి శ్రీనివాస్, ఎం పి హెచ్ ఈ ఓ నాగార్జున, పీహెచ్ఎన్ పి. శివజ్యోతి, ఎంపీహెచ్ ఎస్ పి.ఎన్.జె.కుమారి,సిహెచ్ఓదుర్గ, ఏఎన్ఎం శైలజ, ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 (మనం న్యూస్): భారత ప్రధాని నరేంద్ర మోదీ 75 వ జన్మదిన వేడుకలను భవాని పురం ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారత యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్,మేరా యువ భారత్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , దుర్గమ్మ గుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, మై భారత్ ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము, యూత్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ మేనేజర్ సుబ్బారావు, జనసేన 42 వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. ముందుగా వికాస్ దివాస్ కార్యక్రమంలో లో భాగంగా ఎన్డీఏ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధాని మోడీ ఎట్ 20 ఏళ్ల రాజకీయ జీవితానికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు .ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నింటిలో భారత్ ను అగ్రస్థానంలో నిలబెట్టడానికి ప్రధాని మోడీ ప్రయత్నం చేస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో యువత ముందడుగు వేయాలని వికాస్ దివాస్ కార్యక్రమాన్ని 766 జిల్లాల్లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. మన్ కి బాత్, సభ్యత ఈ సేవ, యంగ్ రైటర్స్, యూత్ పార్లమెంట్ వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రధాని మోడీ రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు.2047 నాటికి ప్రపంచ దేశాలన్నింటిలో భారత్ ను అగ్రస్థానంలో నిలబెట్టడానికి ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. దుర్గమ్మ గుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు మాట్లాడుతూ 13 ఏళ్లు గుజరాత్ సీఎం గాను 11 ఏళ్లుగా ప్రధాన మంత్రి గా కొనసాగుతున్న మోడీ ఆయురారోగ్యాలతో ఉండాలని దేశ సేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు బొల్లేపల్లి కోటేశ్వరరావు,దుర్బేశుల హుస్సేన్, కరిముల్లా, లింగం




శివప్రసాద్, విశ్వంశెట్టి శ్రీనివాసరావు,పెటేటి నాంచారయ్య, పగడాల కృష్ణ, బెన్నా భక్తుల సోమేశ్వరరావు, గోళ్ళ విశ్వేశ్వరరావు, ఏలూరి సాయి శరత్, పోతిన అవినాష్, కురాకుల సురేష్, తమ్మిన లీలా కరుణాకర్, మధు మస్తాన్, పులిచేరి రమేష్, దుర్బేసుల మీరా వలి ఆకారపు విజయ కుమారి, షర్మిల, మంగళపురి మహేష్ ,పత్సవ మల్లికార్జున, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు



జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్: ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను జగ్గయ్యపేటలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన మంత్రివర్యులు నరేంద్ర మోడీ జన్మ దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర రాష్ట్ర నాయకత్వం మరియు బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ సూచన మేరకు సేవా పక్వాడ సేవా పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట పట్టణ పక్షోత్సవ కన్వీనర్ జొన్నలగడ్డ షణ్ముఖ మరియు షేక్ సుభాని, రామిశెట్టి గోపి ల ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులను పరామర్శించి పండ్లను పంచడం జరిగింది మరియు ప్రభుత్వ పాఠశాలలో పిల్లల కి మిఠాయిలను పంచారు . ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా . బిజెపి సీనియర్ నాయకులు మరియు జిల్లా కోర్ కమిటీ మెంబర్ కీసర రాంబాబు , అన్నెపాగ ప్రఫుల్ల శ్రీకాంత్ ,మరియు జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షులు యాంపొంగు రాజా , జగ్గయ్యపేట మండల రూరల్ అధ్యక్షులు పగిడిపర్తి తిరుపతిరావు, వత్సవాయి మండల అధ్యక్షులు పగడాల శ్రీనివాస్ మరియు బి తిరుగేష్ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొనున్నారు.

## తునికి పాటి శివ కు శుభాకాంక్షలు తెలిపిన సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్: రాష్ట్ర విశ్వకర్మ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన తునికి పార్టీ శివను ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అభినందించారు. బుధవారం తన నివాసంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు జనసేన మండల పార్టీ అధ్యక్షులు తునికుపాటి శివ ఆంధ్ర రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ని వారి స్వగృహం నందు



మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉదయభాను గ శివ ని శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామినేని మాట్లాడుతూ విశ్వకర్మ కార్పొరేషన్ డైరెక్టర్ గా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ రాష్ట్ర విశ్వకర్మ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించినందుకు జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ కి, అదే విధంగా ఈ పదవి నాకు రావడానికి కృషి చేసిన ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను కి మనస్ఫూర్తిగా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమాలు జనసేన నేతలు ప్రముఖులు పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి




- గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక

విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17( మనం న్యూస్ ): మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ముఖ్యంగా క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ వ్యాధి సోకకుండా టీకాలు తీసుకోవాలని అను మై బేబీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక అన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో స్వయం సహాయక సంఘాల మహిళలు కు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. కేదారేశ్వరపేట ఫ్రూట్ మార్కెట్ ప్రాంతంలోని వీఎంసీ కళ్యాణ మండపంలో బుధవారం స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒమేగా అను మై బేబీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక హాజరై మహిళల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ జబ్బులను ముందుగానే గుర్తించవచ్చని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలన్నారు. హెచ్ పీ వీ సోకినా అందరిలో అది క్యాన్సర్ గా మారే అవకాశం లేదన్నారు. పీరియడ్స్ సమయంలోను తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సూచించారు మహిళల కోసం , వైద్య పరీక్షలలో 50 శాతం రాయితీతో సేవలందిస్తామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అను మై బేబీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది రియాజ్ సుల్తానా, మోహనలక్ష్మి, శ్రీలక్ష్మి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్ రుద్రపాటి వెంకటేష్ స్వయం సహాయ సంఘాల మహిళలు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు బీ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

మచిలీపట్నం, సెప్టెంబర్ 17,(మనం న్యూస్): కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి నాయుడు, ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వకర్మ జయంతిని దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలోని ప్రజలు ఎంతో నిష్టతో జరుపుతారని, పశ్చిమ బెంగాల్లోని హల్దియా పారిశ్రామిక ప్రాంతం విశ్వకర్మ పూజకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాంతాలలో, దుకాణాలలో, విశ్వకర్మ జయంతిని జరుపుకుంటారు. ఇంజనీరింగ్ ఆర్కిటెక్చర్ వాళ్ళు మాత్రమే కాకుండా వివిధ రకాల చేతి వృత్తుల వారు, హస్త కళాకారులు, మెకానిక్ లు స్మిత్తులు, వెల్డర్లు, పారిశ్రామిక కార్మికులు, ఫ్యాక్టరీ కార్మికులు, మొదలైన వారు కూడా ఎంతో నియమ నిష్టలతో జరుపుతారు. ఈ ఆధునిక యుగంలో ఆయన సిద్ధాంతాలు



మరియు సృజనాత్మకతకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని కష్టపడే తత్వాన్ని పట్టుదలను మరియు నైపుణ్యాన్ని అలవర్చుకుంటే ఎంత కష్టమైనా పనినైనా తేలికగా సాధించవచ్చు అని తెలియచెప్పే విశ్వకర్మ అందరికీ ఆదర్శప్రాయుడని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

## అమ్రిత సాయిలో ఉచిత మెగా వైద్య శిబిరం

కంచికచర్ల, సెప్టెంబర్ 17 (మనం న్యూస్): కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యం లో విజయవాడ కు చెందిన ఆంధ్ర హాస్పిటల్స్, దుహితా డెంటల్ హాస్పిటల్స్ వారి సౌజన్యం తో ' ఉచిత మెగా వైద్య శిబిరం ' ఏర్పాటు చేసినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె. రామ మోహన రావు తెలియ చేసారు. అమ్రిత సాయి యన్.యస్.యస్ యూనిట్ ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరం లో గుండె కు సంబంధించిన పరీక్షలు చేసి తగు సలహాలు సూచనలతో పాటు మందులను సిఫారసు చేసారు. అంతే కాకుండా కళాశాల సిబ్బంది, విద్యార్థులకు కిడ్నీ , దంత సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికీ మందులను సిఫారసు చేసారు. అందరికి బి.పి, షుగరు, 2 డి,ఎకో, ఇ.సి.జి పరీక్షలను ఉచితం గా జరిపారు.ఈ సందర్భం గా సెక్రటరీ, కరస్పాండెంట్ కె. రామ మోహనరావు మాట్లాడుతూ ఇటువంటి వైద్య సేవా కార్యక్రమాలను కళాశాల సిబ్బంది తో పాటు విద్యార్థుల కోసం అమ్రిత సాయి ఎల్లప్పుడూ




నిర్వహిస్తూ ఉంటుందని తెలియచేసారు.కళాశాల ప్రిన్సిపాల్ డా యమ్.శశిధర్ మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరం లో మొత్తం 500 మంది కి పైగా పరీక్షలు నిర్వహించినట్లు తెలియ చేసారు.ఈ వైద్య శిబిరం లో కళాశాల ఉద్యోగులు, విద్యార్థిని, విద్యార్థులు, యన్.యస్.యస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ బి సాయి రామ కృష్ణ, పి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

అవనిగడ్డ, సెప్టెంబర్ 17 (మనం న్యూస్): మహిళలు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో భారత ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం



ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. శాసన సభ్యులు బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ, కుటుంబ బాధ్యతలతో అనేకమంది మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. కొందరు కాన్సరు లాంటి ప్రాణాంతక వ్యాధులను ముందుగా గుర్తించక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై బాధ్యతతో స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమం ద్వారా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పదిహేను రోజుల పాటు ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరంలో అసంక్రమిత వ్యాధుల నివారణ కోసం మహిళలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేస్తారని తెలిపారు. పోషణ అభియాన్ కార్యక్రమంతో పాటు సరైన ఆహారం తీసుకోవడంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. వీటితో పాటు తల్లి బిడ్డలకు వైద్య సేవలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, బాలికలకు ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధికి స్క్రీనింగ్ పరీక్షలు, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు అందిస్తారని వివరించారు. ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాల కోసం ప్రభుత్వం 15 రోజులపాటు నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరం గది, చిన్న పిల్లల వైద్య సేవల గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు.

## ఘనంగా ప్రారంభమైన స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం

మచిలీపట్నం, సెప్టెంబర్17(మనం న్యూస్): చిలకలపూడి డివిజన్ నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్తి నారి ససక్త్ పరివార్ కార్యక్రమాన్ని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని లాంచనంగా ప్రారంభించారు. మహిళల సాధికారత ప్రధాన లక్ష్యంగా, మహిళ ఆరోగ్యవంతంగా ఉంటే సమాజం ఆరోగ్యంవంతగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోడీ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని



తెలిపారు. నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, దేశంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తూ అనేక పథకాలను మహిళలకు చేరువ చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించారని తెలిపారు. కుటుంబంలో మహిళ ఆరోగ్యవంతంగా ఉండటం వల్ల సమాజం మంచిగా ఉంటుందని మహిళలకు అవసరమైన ఆరోగ్య భద్రతను కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 434 వైద్య సేవ శిబిరాల ద్వారా 17 రకాల పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## అసంపూర్తి గోడౌన్ల నిర్మాణాలను పరిశీలించిన ఇంజనీరింగ్ బృందం

జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్: గత ప్రభుత్వంలో మంజూరు కాపాడి ఇంకా పూర్తి కాకుండా అసంపూర్ణంగా ఉన్న గోడౌన్ల



నిర్మాణాలను పరిశీలించాలన్న కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం ఆదేశాలతో నియోజకవర్గంలోని పలు అసంపూర్ణ గోడౌన్లను ఇంజనీరింగ్ బృందం పరిశీలించారు. జగ్గయ్యపేట నియోజకవర్గం లో మల్టీ పర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ రైతుల కు బహుళ విధాల ప్రయోగం నిమిత్తం గత ప్రభుత్వంలో మంజూరు కాబడి నా నేటి వరకు పూర్తి చేయలేకపోయినా గోడౌన్లను పునః పరిశీలించి నిర్మాణాలు పూర్తి చేయుటకు గాను కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ శ్రీ నెట్టెం శ్రీ రఘురామ్ ఆదేశాల మేరకు సహకార సంఘాల పరిధిలో గల గోడౌన్ల అసంపూర్తి నిర్మాణాలు పరిశీలించుటకు బుధవారంవచ్చిన ఇంజనీరింగ్ విభాగం. పోచంపల్లి పరిధిలో 500 మెట్రిక్ టన్నులు గోడౌన్ బేస్మెంట్ లెవల్ లో ఉన్నదానిని పరిశీలించారు. నిర్మాణం అసంపూర్ణంగా ఉండటం తో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని దీన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పోచంపల్లి పి ఎ సి ఎస్ అధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు మరియు పోచంపల్లి సహకార సంఘం అధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, గౌరవరం సహకార సంఘ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో 'స్వస్త్ నారీ'ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం



జగ్గయ్యపేట, సెప్టెంబర్ 17(మనం న్యూస్): జగ్గయ్యపేట పట్టణ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లో స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య బుధవారం ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం, కుటుంబ బలోపేతం ప్రధాన లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఈ జాతీయ పథకం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా కొనసాగనుంది. ప్రధాని జన్మదినం సందర్భంగా ప్రారంభమైన ఈ ప్రత్యేక శిబిరాల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి/గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణుల కౌన్సిలింగ్, పోషకాహార అవగాహన, బాలికలలో హిమోగ్లోబిన్ పరీక్షలు, రక్తహీనత నివారణ, పిల్లల సికిల్ సెల్ అనీమియా పరీక్షలు, టీకాలు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ, రక్తదాన శిబిరాలు, పరిశుభ్రతపై అవగాహన వంటి విస్తృత సేవలు అందించ బడతాయని ఎమ్మెల్యే రాజగోపాల్ తెలిపారు. మహిళల ఆరోగ్యం సుస్థిరంగా ఉంటేనే కుటుంబం, సమాజం బలంగా నిలుస్తుందని గుర్తు చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రతి మహిళా ఈ శిబిరాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డాక్టర్ హరీష్ , పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్,హాస్పటల్ అభివృద్ధి కమిటీ మెంబర్స్ పద్మనాభుని కుటుంబరావు గుడిసె నాగేశ్వరరావు, కాటగాని నరసింహారావు, షేక్ సైదా మరియు హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.

### వత్సవాయిలో ..

వత్సవాయిల్లోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ప్రతి ఇంటి అభివృద్ధి ప్రతి గ్రామ అభివృద్ధి మహిళా ఆరోగ్య మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని అందించి అక్షింతలు వేసి దీవించారు .చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు సర్పంచ్ భూక్య సీతమ్మ ఎండిఓ తదితర అధికారులు, నేతలు ప్రముఖులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం దేశవ్యాప్తంగా కీర్తి గాంచింది

## తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**కామారెడ్డి, సెప్టెంబర్ 17(మనం జిల్లా ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మార్పుల వలన రాష్ట్రం దేశవ్యాప్తంగా కీర్తి గాంచిందని తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి హాజరయ్యారు. కామారెడ్డి పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. కలెక్టరేట్లో పోలీసు వందనం స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నిజాం నిరంకుశ రాజరిక పాలనలో తెలంగాణ ప్రాంత ప్రజలు అనుభవించిన బాధలనుండి తెలంగాణ సాయుధ పోరాటం మరియు ఇతర ప్రజా ఉద్యమాల ద్వారా విముక్తి పొంది, 17 సెప్టెంబర్ 1948లో పోలీస్ చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమై, తెలంగాణ ప్రజలు పొందిన స్వేచ్ఛ స్వాతంత్ర్యం పొందినట్లు గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా అప్పటివరకు పల్లెల్లో నెలకొన్న వెట్టి చాకిరి, భావవ్యక్తీకరణ ఆంక్షలు, మాతృభాష అణచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు తొలగి హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థనుండి ప్రజాస్వామ్యంలోకి మారిందని తెలిపారు. సుస్థిర ప్రజా పాలనలో సంక్షేమాన్ని పంచుతూ, సర్వమతాలను సమానంగా ఆదరిస్తూ, శాంతి సామరస్యాలకు ప్రత్యేకగా నిలిచిందని తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఆదర్శవంతమైన పల్లెలు, పట్టణాలతో ఫరిడవిల్లుతున్నదని పేర్కొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు స్వర్గధామంగా పేరొందిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయాసం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుండి అమలు చేయడం ప్రారంభించిందని



తెలిపారు. వేడుకలకు హాజరైన ప్రజా ప్రతినిధులకు, ఇతర ప్రముఖులకు, జిల్లా అధికారులకు, అతిథులకు ప్రింట్ అండ్ మీడియా సిబ్బందికి, జిల్లా ప్రజలకు, తెలంగాణ సాయుధ పోరాట వీరుల కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులచే నృత్యప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్, కామారెడ్డి ఆర్డిఓ వీణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ మరియు వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సంచార చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయాన్ని పొందాలి
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** సంచార చేపల విక్రయ వాహనాన్ని బుధవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రారంభించారు. కామారెడ్డి జిల్లాలో రెండు వాహనాలు మంజూరు కాగా దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన రంగోల్ స్వప్న, నిజాంసాగర్ మండలానికి చెందిన ఇర్పానా బేగంలకు పది లక్షల విలువగల రెండు వాహనాలు మంజూరు అయ్యాయి. అందులో ఆరు లక్షలు సబ్సిడీ వర్తించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమాట్లాడుతూ., ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయాన్ని పొందాలని, మంచి రుచికరమైన చేపల వంటకాలను ప్రజలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ఎం.సురేందర్, అడిషనల్ డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఎమ్స్ రాజయ్య, సురేష్, జిల్లా సమైక్య అధ్యక్షులు పుష్పరాణి, మండల సమైక్య అధ్యక్షులు భూలక్ష్మి, అంబర్పేట్ వివో అధ్యక్షులు, కార్యదర్శి, సంఘం సభ్యులు, సిసిలు శ్రీనివాస్, సత్యం, ఫిషరీస్ శాఖ అధికారిణి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు... అండగా ఉంటా..!

## కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

**బిక్కనూరు, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** అధైర్య పడొద్దు అండగా ఉంటానని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తెలిపారు. మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ



నాయకులు, భిక్కనూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుర్రి గోపాల్ గారి మాతృమూర్తి బుర్రి రాజవ్వ ఇటీవలే మరణించారు. రాజవ్వ దశదినకర్మను బుధవారం బస్వాపూర్ గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హాజరయ్యారు. రాజవ్వ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆమెతో ఉన్నటువంటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని బాధపడ్డారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. జరిగిన నష్టాన్ని తీర్చలేము కానీ, ఏ కష్టమొచ్చిన ముందుండి ఆదుకుంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ బస్వాపూర్ గ్రామ అధ్యక్షులు అమరవాది సిద్ధరాంరెడ్డి, విండో చైర్మన్ మద్ది స్వామి, నాయకులు బోడపుంటి ప్రకాష్, కర్నాల మల్లేశం, దొరవారి రాజిరెడ్డి, గౌరిగారి రాజిరెడ్డి, చింతనూరి స్వామి, తదితరులు ఉన్నారు.

# రోడ్డు మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్





**కామారెడ్డి, సెప్టెంబర్ 17( మనం ప్రతినిధి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్లను రోడ్ల పునరుద్ధరణ పనులను కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ బుధవారం పరిశీలించారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పిఆర్ రోడ్డు నుండి కామారెడ్డి జిల్లా చుక్కాపూర్ మాచారెడ్డి పిడబ్ల్యుడి రోడ్డు వరకు గల బండ రామేశ్వరంపల్లి రోడ్డు మరమ్మత్తు పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వలన తేగిపోయిన రోడ్లు మరమ్మత్తు త్వరగా పూర్తి చేయించడానికి, ప్రజల రవాణా కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు.

ఆ నిదులతో చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులను పూర్తి నాణ్యతతో త్వరగా పూర్తి చేయించవలసిందిగా పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమములో పంచాయతీరాజ్ ఈఈ దుర్గాప్రసాద్, పాల్వంచ తహసిల్దార్ హిమబిందు, మండల అభివృద్ధి అధికారి కే.శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ దోమకొండ స్వామి, ఏఈఈ లు సంజయ్, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో మెగా రక్తదాన శిబిరం విజయవంతం

- ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం
- 96 యూనిట్ల రక్త సేకరణ
- గొప్ప రాజకీయ చతురత కలిగిన మేధావి ప్రధాని నరేంద్ర మోదీ
- రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు



**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో జీవనజ్యోతి సేవా సంఘం, కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ తెలిపారు. ఈ శిబిరం ద్వారా 96 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ మాట్లాడుతూ., భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప రాజకీయ చతురత కలిగిన మేధావి భారత ప్రధాని నరేంద్ర మోదీ అని ప్రశంశించారు. ప్రపంచంలో వైద్యరంగం ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని తెలిపారు. 96 మంది రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. రక్తదానం చేసిన వారి ప్రాణాలను కాపాడాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలనే ఉద్దేశ్యంతో రక్తదాతలకు హెల్మెట్ లను అందించామన్నారు. అదేవిదంగా రక్తదాతలకు కామారెడ్డి రైల్వే ఎస్ఐ సాధు లింబాద్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించినట్లు వారు పేర్కొన్నారు.

రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన కామారెడ్డి ఎమ్మెల్యే₹

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ప్రధానమంత్రి జన్మదినోత్సవం రోజున రక్తదానం చేయడం చాలా సంతోషకరమని, ప్రధాని ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరుకున్నారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ ఎమ్మెల్యే రమణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు హెల్మెట్ భహుకరించి ప్రశంసా పత్రాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్కె కళాశాల ప్రిన్సిపాల్ అమృత దత్తాద్రి, సాందీపని డిగ్రీ కళాశాల అధ్యాపకులు సురేష్, ప్రభాకర్, బద్దం నిశాంత్ రెడ్డి, జీవన్, వెంకటేష్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# ఇథనాల్ కలిపిన పెట్రోల్పై అన్నీ చెత్త వాదనలు

## కేంద్ర మంతి హర్దీప్ సింగ్ పురి

**ఢిల్లీ,సెప్టెంబర్ 17 :** 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. బయో ఇంధనాల వల్ల ఆటోమొబైల్ ఇంజిన్లు దెబ్బతింటాయని పలువురు చేస్తున్న ప్రచారాలను కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి కొట్టిపారేశారు. పెట్రోల్లో 20 శాతం ఇథనాల్ కలపడం




వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందనేది చెత్త వాదన అన్నారు. ఈ20 ఇంధనం పర్యావరణపరంగా ఉపయోగించడానికి సురక్షితమని పేర్కొన్నారు. అయితే దీర్ఘకాలంలో పాత వాహనాల్లో గ్యాస్కెట్లు, ఇంధన రబ్బరు గొట్టాలు, పైపులను మార్చాల్సి రావచ్చని.. అది సాధారణమైన విషయమేనని పేర్కొన్నారు. పలువురు ఉద్దేశపూర్వకంగానే ఇథనాల్తో సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రజల్లో తప్పుడు భయాలను సృష్టిస్తున్నారని హర్దీప్ సింగ్ పురి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనాల ప్రకారం.. భారత్లో ఇంధన డిమాండ్ రాబోయే రెండు దశాబ్దాలలో ప్రపంచ దేశాల్లో ఉన్న దానికంటే మూడు రెట్లు పెరుగుతుందన్నారు. అటువంటి సమయంలో ఇథనాల్ ప్రధాన ఇంధన వనరుగా మారే అవకాశం ఉందన్నారు. పెట్రోల్తో పోలిస్తే ఇథనాల్ ఎనర్జీ డెన్సిటీ కొంతమేర తక్కువ ఉండడంతో మైలేజీలో తగ్గుదల ఉన్నప్పటికీ.. అది అతి స్వల్పమేనని ఆ శాఖ వెల్లడించింది. ఇ 20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా..? డ్రైవింగ్ను దెబ్బతీస్తుందా..? అని వాహనదారులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇథనాల్ను కలిపిన పెట్రోల్ను వినియోగించడం వల్ల మైలేజీ సమస్యలు వస్తాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఇప్పటికే వివరణాత్మక స్పష్టత ఇచ్చింది. ఇథనాల్ కలిసిన పెట్రోల్తో ఎలాంటి ఇంజిన్ సమస్యలు తలెత్తవని వెల్లడించింది. ఇథనాల్ వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని వ్యాఖ్యానించింది. కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సైతం పలుమార్లు ఈ విషయంపై స్పష్టత నిచ్చారు.

# నిజాం పాలనలో ఎన్నో దారుణాలు

- ‘స్వస్థ్ నారీ సశక్త్ పరివార్’ ప్రారంభం: ప్రధాని మోడీ

**ఇండోర్, సెప్టెంబర్ 17 :** నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోడీ గుర్తుచేశారు. బుధవారం మధ్యప్రదేశ్లోని ధార్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ‘ఈ రోజు సెప్టెంబర్ 17. ఇది మరో చరిత్రాత్మకమైన రోజు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. దానికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం’ అని మోడీ అన్నారు. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారని కొనియాడారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదని మోదీ అన్నారు. ‘‘ఇది నవభారతం. ఎవరికీ భయపడదు. శత్రువుల భూభాగంలోకి వెళ్లి వారిని మన బలగాలు మట్టుపెట్టాయి. అణుబెదిరింపులకు తలొగ్గదు’’ అని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ అణు బెదిరింపులపై మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్తో భారత్ గట్టిగా బదులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు నాడు కథనాలు వచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించిన సంగతి తెలిసిందే. భారత్ ఆర్మీ తమ రహస్య స్థావరాల్లోకి ప్రవేశించి ఎలా దాడులు చేసిందనే విషయాలను వెల్లడించాడు. పాకిస్థాన్ బుద్ధిని వారు



బయటపెట్టారంటూ దీనిని ఉద్దేశించి మోడీ వ్యాఖ్యలు చేశారు.

**‘స్వస్థ నారీ సశక్త్ పరివార్’ కార్యక్రమం ప్రారంభం..**

పుట్టిన రోజున మధ్యప్రదేశ్లో పర్యటిస్తోన్న ప్రధాని మోడీ.. స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ పథకాలను తీసుకొచ్చారు.

# కొంతమందిని జైలుకు పంపండి

- పంట వ్యర్థాల దహనంపై సుప్రీం సీరియస్

**ఢిల్లీ, సెప్టెంబర్ 17 :** దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ఏటా శీతాకాలంలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుతోన్న విషయం తెలిసిందే. అదే సమయంలో పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం దీనికి ఓ కారణమనే వాదనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై తాజాగా మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీనికి పాల్పడుతున్న కొంతమందిని జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించింది.

ఈ అంశంపై అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ మాట్లాడుతూ.. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా ఉండేందుకు రైతులకు సబ్సిడీలు, వివిధ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఉపగ్రహాలు ఆయా ప్రాంతాల మీదుగా వెళ్లే సమయంలో కాకుండా మిగిలిన సమయాల్లో పంట వ్యర్థాలను కాల్చుకోవచ్చని అధికారులు తమకు చెప్పారనే కథనే రైతులు మళ్లీ మళ్లీ చెప్తున్నారని న్యాయస్థానానికి వెల్లడించారు. దీనిపై ఎన్నిసార్లు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు రైతులకు శిక్ష, జరిమానా విధించాలనే కోణంలో ఎందుకు ఆలోచించట్లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రైతులు మనకు అన్నం పెడుతున్నారు కాబట్టి వారు ప్రత్యేకమైనవారని.. అలా అని పర్యావరణాన్ని పాడు చేస్తుంటే చూస్తూ ఊరుకోలేం కదా?అని ప్రశ్నించింది. కొంతమందిని జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్లవుతుందని తెలిపింది. పర్యావరణాన్ని కాపాడాలనే నిజమైన ఉద్దేశం మీకు ఉంటే ఇటువంటి చర్యలకు ఎందుకు దూరంగా ఉంటారని అధికారులను ప్రశ్నించింది. కొన్ని రాష్ట్రాల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల్లో ఖాళీలు ఉండటంపై న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది.

దేశ రాజధాని ఢిల్లీలో శీతాకాలంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోతుంది. దీనికి పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణాల్లో పంట వ్యర్థాల దహనమే ప్రధాన కారణంగా మారుతోంది. దీనిపై కొంతకాలంగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

# చొరబాటుదారులను కాపాడేందుకే కాంగ్రెస్ ర్యాలీలు : అమిత్ షా



**ఢిల్లీ, సెప్టెంబర్ 17 :** ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ‘ప్రత్యేక సమగ్ర సవరణ’ ప్రక్రియకు బీజేపీ మద్దతిస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించారు. చొరబాటుదారుల ఓట్లతో గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో స్థానిక ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

‘‘చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇటీవల ‘ఓటర్ అధికార్ యాత్ర’ నిర్వహించింది. వారి ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. దేశ ఓటర్లను విశ్వసించడం లేదు. హస్తం పార్టీ అసలు స్వరూపాన్ని గుర్తించే సమయం ఆసన్నమైంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ప్రత్యేక సమగ్ర సవరణకు బీజేపీ మద్దతిస్తోంది’’ అని అమిత్ షా పేర్కొన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని అమిత్ షా తెలిపారు. గత 11 ఏళ్లలో 60 కోట్లమంది పేదలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడుల ద్వారా ప్రధాని మోడీ దేశ సరిహద్దుల్లో భద్రతను కాపాడుతున్నారని ప్రశంసించారు. ‘ఆపరేషన్ సిందూర్’తో పాకిస్థాన్కు గట్టి గుణపాఠం చెప్పారన్నారు.

# ఛత్తీస్గఢ్లో 12 మంది మావోయిస్టుల లొంగుబాటు

**నారాయణపూర్, సెప్టెంబర్ 17 :** ఛత్తీస్గఢ్ నారాయణపూర్ జిల్లాలో 12 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది తలలపై మొత్తంగా రూ.18 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు




వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా వారంతా మావోయిస్టు అగ్రనేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 177 మంది మావోయిస్టులు లొంగిపోయారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. మరోవైపు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. గట్టా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం ఆధారంగా భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలంలో భారీ ఎత్తున ఆయుధాలను గుర్తించారు. ఇదిలా ఉంటే ..2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. భారతదేశంలోని పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాల్లో పాల్గొంటామని పేర్కొంది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఒక ప్రకటన విడుదల చేసింది.



## దసరా ఏర్పాట్లపై మంత్రివర్గ సమీక్షకు సన్నాహాలు

**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, దుర్గగుడి ఈవో వి.కె. శీనా నాయక్తో కలిసి దసరా ఉత్సవాల ఆహ్వానం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డికి సమర్పించారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం కొనసాగుతున్న ఏర్పాట్ల పురోగతిని వివరించారు. ఇంద్ర కీలాద్రిపై దసరా ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్ల పురోగతిని వారు మంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎండోమెంట్స్ హరి జవహర్ లాల్ సీనియర్ ఐ.ఏ.ఎస సమక్షంలో అన్ని విషయములు వివరించినారు. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సంబంధించి భక్తుల వసతులు, భద్రత, రవాణా వంటి విషయాలపై జరుగుతున్న పనులను తెలిపారు. మంత్రుల బృందం సమీక్షకు ముందే అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడానికి దేవస్థానం అధికారులు వేగంగా పనిచేస్తున్నారని వివరించారు. ఈ సమీక్ష తర్వాత దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన తుది నిర్ణయాలు తీసుకుంటారు.

## ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుక



**మచిలీపట్నం, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు నాగ సాయిరాం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 15 రోజులపాటు బీజేపీ మండల అధ్యక్షుడు నాగ సాయిరాం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి రక్తం ఎంతో అవసరమని సమాజంలో దాతలు రక్తదానం చేయడం వల్ల ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వారు అవుతామని తెలిపారు. విజయ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో మంచి విషయమని కొనియాడారు. అనంతరం, వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు దుప్పట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మీడియా జిల్లా కన్వీనర్ ఘంట సతీష్, నాయకులు పాల్గొన్నారు.

## ఇన్స్పెక్టర్ రామారావుకు వల్లభనేని సన్మానం




**ఉయ్యూరు, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ఉయ్యూరులో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాలు నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పక్కడ్బందీగా బందోబస్తు నిర్వహించిన పోలీసు శాఖ ఎప్పటికప్పుడు సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు వేస్తూ పర్యవేక్షించిన ఉయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావును ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) రామారావును సత్కరించారు. కులమతాలకు అతీతంగా నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఇన్స్పెక్టర్ రామారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని కొనియాడారు.

## పోషకాహారాలు శరీరానికి మేలు చేస్తాయి



పోషకాహారాలు అందజేస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ, వరలక్ష్మి, డాక్టర్ సుమ

**విజయవాడ సెంట్రల్, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** స్థానిక 64 డివిజన్లో సాయిబాబా గుడి వద్ద ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తిరుపతమ్మ, టీడీపీ నాయకురాలు కె.వరలక్ష్మి, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సుమా సీతారాం పాల్గొని పలువురు మహిళలకు పోషకాహారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కే రవి కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్కే బాబు, యూనిట్ ఇన్చార్జ్ వరలక్ష్మి, కంకణాల బాబు, కోమరి రాజేష్, కోరాడ రమణ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీ కేశినేనికి బెజవాడ న్యాయవాదుల సత్కారం



**విజయవాడ సెంట్రల్, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ది బెజవాడ బార్ అసోసియేషన్ కార్యాలయానికి చేరుకుని ~~విజయవాడ ఉత్సవ్ ను విజయవంతం చేయాలని న్యాయవాదులను కోరారు. అందుకు న్యాయవాదులు~~ సైతం తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. న్యాయవాదులు తమ బార్ అసోసియేషన్ ఆధునీకరణ గురించి, వారికి ఉన్న సమస్యల్ని వివరించారు. వీటికి ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ ఆధునీకరణ కోసం రూ.30 లక్షల నిధులను వారం రోజుల్లోగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ ఉత్సవ్కు అందరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బెజవాడ బార్ అసోసియేషన్ ముందుగా విజయవాడ ఉత్సవాన్ని ప్రోత్సహిస్తూ బైక్ ర్యాలీ చేపట్టిందని, దీనిని తాము కూడా స్ఫూర్తిగా తీసుకొని ప్రతి వార్డులో బైక్ ర్యాలీ చేపిస్తామని హామీ ఇచ్చారు.

# చెత్త రహిత నగరంగా దిద్దుబాటుకు విస్తృత చర్యలు

- విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా




**విజయవాడ సెంట్రల్, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** స్వచ్ఛత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమేకాదు, ప్రతి ప్రజానీకంకూడా దీనిలో భాగస్వాములు కావాలి - ప్రతి రోజూ కొంత సమయం స్వచ్ఛత కోసం వెచ్చిస్తే మన నగరం, మన దేశం స్వచ్ఛంగామారుతుంది ఎమ్మెల్యే బొండా ఉమ బుధవారం సెంట్రల్ నియోజకవర్గం లోని 64వ డివిజన్ కండ్రిక నందు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆధ్వర్యంలో ' స్వచ్ఛత హీ సేవ ' బి.వి. సుబ్బారెడ్డి మునిసిపల్ హై స్కూల్ విద్యార్థులు పరిసరాలనుక్లీన్ చేసే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించి ఎటువంటి చెత్తకుప్పలు గాని మట్టి దిబ్బలు గాని రోడ్లమీద వేయరాదని ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులుబొండా ఉమామహేశ్వరరావు పాల్గొని మొక్కలు నాటి, రోడ్ల పైన ఉన్న చెత్తను శుభ్రం చేయడం జరిగింది. బొండా ఉమా మాట్లాడుతూ స్వచ్ఛతను పరిరక్షించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, చెత్తను సరైన విధంగావేపా చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సందేశాలు పంపిస్తున్నాం అని. విజయవాడ నగరాన్ని 7జి స్టార్ రేటింగ్ సాధించేందుకుఅధికారులుఅవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు, భారతదేశంలోనే అత్యున్నత నగరాల్లో విజయవాడ ఒకటిగా నిలిచేలాప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది అని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు కార్యక్రమాలు పెద్ద ఎత్తున సెంట్రల్ నియోజకవర్గం లో ప్రతి డివిజన్లోనూ, ప్రతి వీధిలోనూ మురుగు, మురికి, చెత్త లేకుండా చూసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం అని దోమల వ్యాప్తిని నివారించేందుకున్యూ రాజరాజేశ్వరి పేటలోప్రభుత్వంవెంటనే చర్యలు తీసుకుని,అధికారులందరూ కలిసి ప్రతి ఇంట్లోనూ దోమల నిర్మూలనకు శాశ్వత పరిష్కారాలు చేపడుతున్నాం అని, డయేరియా వల్ల న్యూ రాజరాజేశ్వరి పేట నందు ఎక్కడా ఒక్క ప్రాణం కూడా పోకుండా కాపాడేందుకు ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ నాయకులు మున్సిపల్ సిబ్బంది, అధికారులు అహర్నిశలు శ్రమిస్తున్నారు అని. ప్రభుత్వం అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్లు వ్యాపించే అవకాశం ఉన్నందున దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం ప్రజలందరూ కూడా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది అని. కార్పొరేషన్ సిబ్బంది, శానిటైజర్ సిబ్బంది ప్రజల ఆరోగ్యం కోసంఅహర్నిశలు పనిచేస్తున్నారు,ప్రజలందరూ కూడా వారికి సహకరించాలి, మంచి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలు, అనారోగ్య సమస్యల నుండి రక్షణ పొందవచ్చు,స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నియోజకవర్గం మొత్తం జరుగుతోంది అని ప్రతి డివిజన్లోనూ పెద్ద ఎత్తున బృందాలను ఏర్పాటు చేసి, అవసరమైతే ఒక డివిజన్లో 150 మంది వర్కర్లను నియమించి, కాలువలను శుభ్రం చేసి, చెత్తను తొలగించి, నీరు నిల్వ ఉండకుండా చూసి, లార్వా అభివృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా ప్రతి ఒక్కరూస్వచ్ఛతను తమ జీవన విధానంలోభాగం చేసుకోవాలి అని, ఇది మనందరి బాధ్యత స్వచ్ఛ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరు సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రగొర్ల తిరుపతమ్మ, నాయి బ్రాహ్మణ డైరెక్టర్గా సురవరపు నాగ రాజు, డివిజన్ అధ్యక్షులు కాకొల్లు రవి కుమార్, ప్రధాన కార్యదర్శి ఖిజు బాబు, పలగాని భాగ్యలక్ష్మి, పలగాని శివ, వరలక్ష్మి, కోమరి రాజేష్, కంకణాలు బాబు, తెల్ల భవాని,కోరాడ రమణ, రమణ, నాగేశ్వరి, అడప సాయి, మాకం సుందర్రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గంగకు మాజీ మంత్రి వెల్లంపల్లి సన్మానం



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైసీపీ విజయవాడ పశ్చిమ కార్యాలయం నందు బుధవారం నూతనంగా వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ మాజీ మంత్రి, పశ్చిమ వైసీపీ ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావుని కలిసి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. వెల్లంపల్లి శ్రీనివాస రావు గోదావరి గంగని శాలువాతో సన్మానించారు, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 6వ వక్ఫ్ బోర్డ్ సమావేశం

- ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** విజయవాడలోని కాళేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 6వ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలు మ్యానేజింగ్ కమిటీలు, పలు ముతవల్లీలను నియమించారు.

అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పలుకు స్థలాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు బోర్డు అంగీకరించిందని త్వరలో వాటి వివరాలను వెల్లడిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 28 ప్రదేశాల్లో తాలిం ఏ హునర్ పేరు తో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పలు చోట్ల జరిగిన అక్రమ ఆక్రమణల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. వక్ఫ్ ఆస్తులను కాపాడుతూ వాటి ద్వారా సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను చేపడతామని తెలిపారు. వక్ఫ్ బోర్డ్ కార్యకలాపాలను మరింత పారదర్శకంగా కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనమండలి సభ్యులు మొహమ్మద్ రుహుల్లా, శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, దావూద్ భాషా బఖావి, బేపారి జాకీర్ అహమద్ సీఈఓ మొహమ్మద్ అలీ వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా పనితీరు ఉండాలి

- ముఖ్యమంత్రి దిశానిర్దేశానికి అనుగుణంగా పనిచేయాలి
- దసరా మహోత్సవాలకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవ్వాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ




**విజయవాడ సెంట్రల్, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా అధికారులు పనితీరును మెరుగుపరుచుకోవాలని, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చేసిన సూచనలకు అనుగుణంగా పనిచేసి, జిల్లాకు వన్నె తేవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాస్థాయి అధికారులతో కలిసి ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులతో వీసీ నిర్వహించారు. రెండు రోజుల పాటు సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి చేసిన సూచనలను తెలియజేశారు. జీడీడీపీ, జీవీఏలో పురోగతికి అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. రైతుల ఆదాయాలను మెరుగుపరిచేందుకు ఉపయోగపడే ఉద్యాన, పశుసంవర్థక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. డివిజనల్ స్థాయిలో ఆర్డీవోలతో పాటు ఇతర శాఖల అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఏ స్థాయిలో సమస్య పరిష్కారం అవుతుందో, దానికి ఎలాంటి పద్ధతి అనుసరించాలో కూడా తెలపాలన్నారు. దీనికై ప్రతిశాఖా జిల్లా నుంచి మండల స్థాయి వరకు సమస్య పరిష్కార విధానాన్ని తెలిపే ఫ్లో చార్ట్ లను తెలుగు, ఇంగ్లీష్లో రూపొందించాలన్నారు. పాలనలో పారదర్శకత అవసరం ఉన్న విషయాన్ని అధికారులు అంతా గ్రహించాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

### తాగునీటి సరఫరా వ్యవస్థలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో ఎక్కడైనా తాగునీటి పైపులు పగలడం, పైపుల లీకేజీ వంటి సమస్యలు ఉంటే కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ నంబరు 91549 70454 కు తెలియజేయాలన్నారు. ఈ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని.. సంబంధిత ఫిర్యాదుదారుకు ఆ సమాచారం తెలపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. సమస్య పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ - స్పోక్ జిల్లాకు ఒక వరమని దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ప్రతి శాఖ కృషిచేయాలన్నారు. ప్రతి శాఖ దస్త్రాలను (ఫైల్స్) ఈ- ఆఫీస్లోనే పంపాలని చెప్పారు. విధి నిర్వహణలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. లక్షలాది భక్తులు హాజరయ్యే దసరా మహోత్సవాల సక్రమ నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి



**విజయవాడ సెంట్రల్, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ప్రపంచ సృష్టిలో మొట్టమొదటి వాస్తు శిల్పి, బ్రహ్మదేవుని మానసపుత్రుడు శ్రీ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని విజయవాడ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్.వారి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన శ్రీ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ ప్రపంచ సృష్టి సందర్భంలో వాస్తు శిల్పానికి ఆద్యుడు, బ్రహ్మదేవుని మానసపుత్రుడిగా పరిగణించబడే శ్రీ విశ్వకర్మ భగవానుడు శిల్పకళ, వాస్తుకళ, యాంత్రిక విజ్ఞానానికి మూలాధారంగా నిలిచారని, వేదాల్లోనూ, పురాణాల్లోనూ ఆయన్ని దివ్య వాస్తుశిల్పిగా, దేవ శిల్పి 'గా స్మరించేవారని, విశ్వకర్మ జయంతి ప్రతి ఒక్కరికీ కేవలం ఆధ్యాత్మిక ఉత్సవమే కాకుండా, కష్టపడి పని చేసే వారికి స్ఫూర్తినిచ్చే రోజు అని పేర్కొన్నారు. విశ్వకర్మ భగవానుడి శక్తి, సృష్టిశీలత, క్రమశిక్షణ మనందరికీ ఆదర్శం కావాలన అభిప్రాయపడ్డారు. పోలీసు విధుల్లోనూ శ్రమ, నైపుణ్యం, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని గుర్తు చేశారు. 'జూమన దేశం పురోగతికి కష్టపడే కార్మికులు, శిల్పులు ఎంత ముఖ్యమో, సమాజంలో శాంతి భద్రతలకు పోలీసుల శ్రమ అంతే కీలకం'' అని అన్నారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ తోపాటు, ఇతర పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కామినేనిలో అత్యంత క్లిష్టమైన మోకీలు మార్పిడికి శస్త్ర చికిత్స

- 110 కిలోల బరువున్న 65 ఏళ్ల మహిళకు విజయవంతంగా మోకీలు మార్పిడి
- ఆర్థోపెడిక్, ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ షణ్ముఖ్ తూమాటికి అభినందనలు వెల్లువ
- కామినేనిలో వివిధ వైద్య విభాగాలు ఒకేచోట ఉండటంతో మెరుగైన చికిత్సా అవకాశాలు
- కామినేని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్




**గాంధీనగర్, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** నగరంలోని కామినేని హాస్పిటల్ నందు అత్యంత సంక్లిష్టమైన మోకీలు మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 110 కేజీల బరువున్న 65 ఏళ్ల మహిళకు మోకీలు మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించిన ఆర్థోపెడిక్, ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ షణ్ముఖ్ సరికొత్త రికార్డు సృష్టించారు. సాధారణంగా ఇంత ఎక్కువ బరువున్నవారికి.. అందునా, మెదడులో రక్తం గడ్డ కట్టిన వ్యక్తికి.. ఈ తరహా మోకీలు మార్పిడి సాధ్యపడదు. అయితే, డాక్టర్ షణ్ముఖ్.. ఈ చికిత్సను విజయవంతంగా పూర్తిచేసి.. మరుసటి రోజే పేషెంట్ సాధారణంగా నడిచేలా చేయగలిగారు. ఈ అత్యంత అరుదైన, అతి సంక్లిష్టమైన శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు బుధవారం నాడు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలోని ఇంద్రప్రస్థ హోటల్లో జరిగిన ఈ సమావేశంలో కామినేని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్ మాట్లాడుతూ.. అసాధ్యమనుకున్న చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ షణ్ముఖ బాబును అభినందించారు. కామినేని హాస్పిటల్స్ నందు అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండటంతో చికిత్స అవకాశాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. అత్యంత అనుభజ్ఞులైన వైద్య నిపుణులు, అత్యాధునిక వైద్య సంపత్తితో కామినేనిలో అంతర్జాతీయ స్థాయి వైద్య చికిత్సలను అందిస్తున్నామని డాక్టర్ వర్ధన్ వెల్లడించారు. అనంతరం, డాక్టర్ షణ్ముఖ్ తూమాటి మాట్లాడుతూ.. 'మోకాలి నొప్పితో నడవలేని స్థితిలో ఉన్న 65 ఏళ్ల మహిళకు నీ రీప్లేస్మెంట్ సర్జరీ నిర్వహించాం. పేషెంటుకు బ్రెయిన్లో చిన్న క్లాట్ కూడా వుంది.

ఈ పరిస్థితుల్లో మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయడం కుదరకపోవచ్చు. అయితే, హాస్పి టల్లోని వివిధ విభాగాల వైద్యుల సహకారంతో, బహుళ వైద్య సేవలను అందుబాటులో ఉంచుకుని అత్యంత క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను నిర్వహించాం. శస్త్రచికిత్స విజయవంతమై.. చికిత్స చేసిన మరుసటి రోజు నుండి పేషెంట్ సాధారణంగా నడవగలుగుతున్నారు' అని వివరించారు. కామినేనిలోని అడ్వాన్స్డ్ ట్రామా సెంటర్ నందు అనేక క్లిష్టమైన చికిత్సలను నిర్వహిస్తూ వస్తున్నామని, వేరే ఆసుపత్రుల్లో చికిత్స చేయలేకపోయిన కేసుల్లో సైతం విజయవంతంగా చికిత్స చేసి, అనేక మంది ప్రాణాలను కాపాడగలిగామని తెలిపారు. అన్ని విభాగాలు ఒకేచోట ఉండటంతో కామినేని హాస్పిటల్ మెరుగైన వైద్య చికిత్సలను అందించడంలో ముందంజలో ఉందని డాక్టర్ షణ్ముఖ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కామినేని క్లస్టర్ హెడ్ పి.సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు పాల్గొన్నారు.

## వరల్డ్ నెంబర్ వన్ బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి




టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కెరియర్లో తొలిసారిగా కెరియర్లో ఉత్తమ ర్యాంక్ సాధించాడు. ఐసీసీ బెస్ట్ నెంబర్ వన్‌గా బౌలర్‌గా నిలిచాడు. ఐసీసీ బుధవారం టీ20 ర్యాంకింగ్స్ను విడుదల చేసింది. ఈ ఘనత సాధించిన మూడో భారతీయుడిగా నిలిచాడు. ర్యాంకింగ్స్లో ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ మూడు స్థానాలను ఎగబాకారు. వరుణ్ గతేడాది ఫిబ్రవరిలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. మార్చి నుంచి అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్‌కు బౌలర్ జాకబ్ డఫీని అధిగమించి నెంబర్ వన్‌గా నిలిచాడు.తాజాగా యూఏసీ వేదికగా జరుగుతున్న ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శన చేసి బౌలర్ల ర్యాంకింగ్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. వరుణ్ చక్రవర్తి స్థిరమైన ఫామ్ను కొనసాగిస్తూ టీ20ల్లో నెంబర్ వన్ బౌలర్గా నిలిచాడని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అదే సమయంలో ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 16 స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకున్నారు. స్పిన్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ఒక స్థానం మెరుగుపరుచుకొని 12వ స్థానానికి చేరుకున్నాడు. బుమ్రా 40వ స్థానానికి చేరుకున్నాడు. ఆల్రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. టీమిండియా బ్యాటర్ అభిషేక్ శర్మ తన ర్యాంకులు పదిలం చేసుకున్నాడు. యూఏఈపై 16 బంతుల్లో 30 పరుగులు, పా 13 బంతుల్లోనే 31 పరుగులు చేసి కెరియర్లోనే అత్యధికంగా 884 రేటింగ్ పాయింట్లతో నెంబర్ వన్ బ్యాట్‌మెన్‌గా కొనసాగుతున్నాడు. టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ శుభమన్ గిల్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకొని 39వ స్థానానికి చేరాడు. అయితే, తిలక్ వర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ర్యాంకులు దిగజారాయి. తిలక్ రెండుస్థానాలు దిగజారి నాలుగో స్థానానికి, సూర్యకుమార్ ఒక స్థానం దిగజారి ఏడో ర్యాంకుకు చేరాడు. ఆసియా కప్ జట్టులో చోటు దక్కని యశస్వి జైస్వాల్ సైతం రెండు స్థానాలు దిగజారి 13వ స్థానికి చేరుకున్నాడరు. మాంచెస్టర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన తర్వాత ఇంగ్లాండ్ ఓపెనింగ్ జోడీ ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ వరుసగా ఒక స్థానం ఎగబాకి రెండు, మూడు స్థానాలకు చేరారు.

## ఆసీస్‌పై భారత మహిళల జట్టు ఘన విజయం




ముల్లాన్పూర్ వేదికగా ఆసీస్ జట్టుతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ఆస్ట్రేలియా జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్కు దిగిన టీమ్ఇండియా 49.5 ఓవర్లలో 292 పరుగులు చేసి ఆలౌటైంది. స్మ ృతి మంధాన 117 పరుగులతో (91 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్స్ల సాయంతో) రాణించింది. దీప్తి శర్మ 40 పరుగులు (53 బంతుల్లో) చేసింది. ఆసీస్ బౌలర్లలో డార్సీ బ్రౌన్ 3, యాష్లీ గార్డనర్ 2, మేగాన్ షట్, అన్నాబెల్ సదర్లాండ్, తహ్లియా మెక్గ్రాత్ తలో వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 40.5 ఓవర్లలో 190 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో ఎల్లీస్ పెర్రీ 44, అన్నాబెల్ సదర్లాండ్ 45 మాత్రమే రాణించారు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ మూడు, దీప్తి శర్మ చెరో రెండు వికెట్లు, రేణుకా సింగ్ ఠాకూర్, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ తలో వికెట్ తీసుకున్నారు.

## ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్..

## ఫైనల్‌లో నీరజ్ చోప్రా




భారత జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రా ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ )లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్లో తొలి ప్రయత్నంలోనే 84.85 మీటర్ల త్రోతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఆటోమేటిక్ క్వాలిఫయింగ్ మార్కు 84.50 మీటర్లు. దీంతో నీరజ్‌కు మళ్లీ త్రో విసిరే అవసరం రాలేదు. పోలండ్ అథ్లెట్ డేవిడ్ వెంగెర్ తొలి రెండు ప్రయత్నాల్లో (79.72 మీ, 73.97 మీ)తో వెనకబడ్డాడు. కానీ, ఇతను మూడో ప్రయత్నంలో 85.67 మీటర్లు విసిరి ఫైనల్కు అర్హత సాధించాడు. జర్మన్ అథ్లెట్ జులియన్ వెబర్ తొలి ప్రయత్నంలో (82.29 మీ) విసరగా.. రెండో ప్రయత్నంలో (87.21 మీ) త్రోతో ఫైనల్‌కు క్వాలిఫై అయ్యాడు. గురువారం ఫైనల్ జరగనుంది.

# మోడీ జీవితంపై బయోపిక్

## : ఉన్ని ముకుందన్ పోస్ట్




మలయాళం సినీ నటుడు ఉన్ని ముకుందన్.. ప్రధాని మోదీ పాత్రను పోషించనున్నారు. మోదీపై తీస్తున్న బయోపిక్‌లో అతను మోడీ రోల్ ప్లే చేయనున్నారు. అన్ని భారతీయ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ఈ ఫిల్మ్‌కు మా వందే అని టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ప్రఖ్యాత ఫిల్మ్‌మేకర్ క్రాంతి కుమార్ సీహెచ్ ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు.ప్రధాని మోదీ పాత్రలో నటించనున్నానని, ఈ విషయాన్ని పంచుకునేందుకు సంతోషిస్తున్నానని, మా వందే -టైటిల్‌తో ఆ ఫిల్మ్ రిలీజ్ కానున్నదని నటుడు ఉన్ని ముకుందన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. బుధవారం ప్రధాని మోదీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదని ఆ ఫిల్మ్‌కు ట్యాగ్‌లైన్ ఇచ్చారు. అహ్మద్‌బాద్‌లోనే పెరిగానని, తన చిన్నతనంలో మోదీని సీఎంగా చూశానని, ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో ఆయన్ను వ్యక్తిగతంగా కలుసుకున్నానని, ఆ సమయంలో మోదీపై తనకు ప్రత్యేక అభిమానం కలిగినట్లు- ముకుందన్ తెలిపారు. ఓ నటుడిగా ప్రధాని మోదీ పాత్రను పోషించడం పట్ల సంతోషంగా ఫీలవుతున్నానని, ఇది చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉందన్నారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితం అసాధారణంగా సాగిందని, అయితే తాము తీయబోయే సినిమాలో మోదీని మరో కోణంలో చూపిస్తామని, తన మాతృమూర్తితో ఉన్న అనుబంధాన్ని ఆ ఫిల్మ్‌లో ఎక్కువగా ఫోకస్ చేయనున్నట్లు- నటుడు ఉన్ని ముకుందన్ తెలిపారు. ఎవరి ముందు తలవంచవద్దు అని గుజరాతీలో మోదీ చెప్పేవారని ఆయన గుర్తు చేశారు. ప్రధాన భాషల్లో మా వందే సినిమాను తీస్తామని, ఆ తర్వాత దాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్‌చేయనున్నట్లు- ఆయన చెప్పారు. మోదీ బర్త్‌డే సందర్భంగా ఆయనకు విషెస్ తెలిపారు.



## వందకోట్ల క్లబ్‌లో చేరిన మిరాయ్ మూవీ

యంగ్ హీరో తేజ సజ్జా నటి శ్రియా శరణ్‌పై ప్రశంసలు కురిపించారు. తనది ఈ సినిమాలో అమ్మ పాత్ర కాదు.. ఈ కథకు అమ్మ పాత్ర అని అన్నారు. ఆమె వల్లే ఈ సినిమాకు లక్ కలిసొచ్చిందన్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. మంచు మనోజ్ కీలక పాత్ర పోషించారు. ఇటీ-వల విడులైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహించిన విజయోత్సవాల్లో తేజ సజ్జా మాట్లాడారు.తేజ సజ్జా, మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మిరాయ్' విజయాన్ని అందుకుంది. ఈ సినిమా సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాగా.. తొలిరోజు రూ.20 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఐదు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. తమ సినిమా రూ.100 కోట్లు- సాధించడంపై తేజ సజ్జా, మంచు మనోజ్ ఆనందం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఈ సినిమా సక్సెస్ మీట్‌ను విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ప్రేక్షకులంతా కుటుంబంతో కలిసి సినిమా చూడాలన్న ఉద్దేశంతోనే దీని టికెట్ ధరలు కూడా పెంచలేదని నిర్మాత తెలిపారు. ఈ విజయం తర్వాత తనలో మరింత బాధ్యత పెరిగినట్లు- తేజ చెప్పారు. ఈ సినిమా దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని సీక్వెల్‌లో నిధి అగర్వాల్ స్పెషల్ సాంగ్ ఉంటు-ందని తెలిపారు. నిధితో ఓ ప్రత్యేక పాట చిత్రీకరించామని.. మొదటి పార్ట్‌లో వాడలేకపోయామన్నారు.. సెకండ్ పార్ట్ కోసం కొన్ని ఐడియాలు సిద్ధంగా ఉన్నట్లు- చెప్పారు.

## ఇళయరాజా కేసు.. నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు



అగ్రకథానాయకుడు అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ'ని నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగించారు. ఈ సినిమా విషయంలో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు దీన్ని తొలగించినట్లు నెట్‌ఫ్లిక్స్ పేర్కొంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్‌లో ఆదరణ సొంతం చేసుకున్న అనంతరం మే8న నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. అయితే ఈ చిత్రంలో అనుమతి లేకుండా తన పాటలను ఉపయోగించారని ఆరోపిస్తూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కోర్టులో పిటిషన్ వేశారు. ఇది కాపీరైట్ చట్టానికి విరుద్ధమని, వాటిని తొలగించాలని, పాటలు ఉపయోగించినందుకు తగిన పరిహారం ఇవ్వాలని ఇళయరాజా కోరారు. దీనిపై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు ఆయన పాటలను సినిమాలో ప్రదర్శించొద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీ-వల ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి మీడియాతో మాట్లాడుతూ.. తాము విడుదలకు ముందే అన్ని పర్మిషన్లు తీసుకున్నట్లు చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా పాటలను ఉపయోగించామన్నారు.



## ఆ సినిమా నాకు మరో జీవితాన్నిచ్చింది

''లవ్ సోనియా' విజయం నా జీవితానికి ఊహించని బహుమతిని ఇచ్చింద''ని అంటోంది కథానాయిక మృణాల్ ఠాకూర్. ఎంచుకున్న పాత్రలతోనే ప్రేక్షకుల్లో గుర్తుండిపోయే తారల్లో ముందు వరుసలో ఉంటుందీమె. తన నటనతో కట్టిపడేసే ఈ భామ. 'లవ్ సోనియా' చిత్రంతో బాలీవుడ్లోకి అడుగుపెట్టింది. ఇది విడుదలై ఇటీవలే ఏడేళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రం గురించి పంచుకుంటూ ఇన్స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది మృణాల్. ''ఒక చిన్న పట్టణానికి చెందిన అమ్మాయిని నేను.వేలాది మందిలో ఈ సినిమాకు నన్ను ఎంపిక చేసుకోవడం సంతోషంగా అనిపించింది. ఇది నా మొదటి చిత్రం మాత్రమే కాదు.. జీవితాలను మార్చే సినిమా ప్రపంచంలోకి నేను వేసిన తొలి అడుగు. 'లవ్ సోనియా' సినిమా సెట్లో ఉన్నప్పుడు నాకు కలిగిన భయం ఇంకా గుర్తుంది. ఇందులో నటించిన డెమి మూర్, రిచా చద్దా, మనోజ్ బాజ్పేయీ లాంటి నటులు ప్రతి రోజు కొత్తగా ఏదో ఒకటి నేర్పించారు. సెట్లో వీరందరి మధ్య విశాలమైన సముద్రంలో అతి చిన్న చేపలా భావించాను. కానీ ఈ చిత్రానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఎందుకంటే నాకు మాట్లాడే ధైర్యాన్ని, చిత్రపరిశ్రమలో మరో కుటుంబాన్ని, జీవితాన్ని ఇచ్చింది. ఈ ప్రయాణంలో మద్దతుగా నిలిచి ప్రేమను పంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని ఆ పోస్ట్లో పేర్కొంది.

## ఆ సినిమా చూసి తను భయపడ్డాడు



ఒకప్పుడు అగ్ర కథానాయకిగా అలరించిన శ్రియా శరణ్ ప్రస్తుతం పలు సినిమాల్లో కీలక పాత్రలతో మెప్పిస్తున్నారు. తాజాగా 'మిరాయ్'తో ప్రేక్షకుల ముందుకువచ్చారు. తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీని ప్రచారంలో భాగంగా ఈ చిత్రబృందం 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ శర్మ షో'లో సందడి చేసింది. ఈ షోలో పాల్గొన్న శ్రియా శరన్ తన భర్త ఆండ్రీను తొలిసారి కలిసిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ''నేను పొరపాటున విమాన టికెట్ ఒక ప్రాంతానికి బదులు మరో ప్రాంతానికి బుక్ చేసుకున్నా. దీంతో ఒంటరిగా మాల్దీవులకు వెళ్లాల్సివచ్చింది. అక్కడే ఆండ్రీని తొలిసారి కలిశాను. ఒకరికిఒకరం తెలియకుండానే ఆ ట్రిప్పు ఎంజాయ్ చేశాం. మేమిద్దరం కలిసి చూసిన మొదటి సినిమా 'దృశ్యం'. ఆ మూవీ చూసి ఆండ్రీ భయపడ్డాడు'' అని శ్రియ గుర్తుచేసుకున్నారు.

## టాలెంట్ ఉంటే అవకాశం అదే వస్తుంది: మంచు మనోజ్



ఇండస్ట్రీలో రాణించాలనే తపన ఉంటే ఎవరైనా హీరోలు కావొచ్చని నటుడు మంచు మనోజ్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఆయన కీలక పాత్రలో నటించిన మిరాయ్ చిత్రం భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా చూసిన తర్వాత మా అమ్మ నన్ను హత్తుకొని భావోద్వేగానికి గురైంది. నేను పోషించిన మహావీర్ లామా పాత్రపై ఆమెకు ఎంతో గర్వంగా అనిపించింది. అలాగే మా అక్క కూడా నాకు ప్రశంసలు అందించింది. కుటుంబసభ్యులతో కలిసి ఈ సినిమా చూడటం నాకు ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం అని మనోజ్ తెలిపారు. అభిమానుల మద్దతు గురించి మాట్లాడుతూ, నేను విజయం సాధించాలని నా అభిమానులు కోరుతున్నారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. ఇప్పుడు నాకు ఇంత పెద్ద కుటుంబం ఉందని గర్వంగా చెప్పగలను అన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ గురించి ప్రస్తావిస్తూ, ఇండస్ట్రీలో ఇలాంటి నిర్మాతలు చాలా అరుదు. రాజీపడకుండా సినిమాలు చేస్తున్నారు అని ప్రశంసించారు. మోహన్ బాబు కొడుకు, చిరంజీవి కొడుకు మాత్రమే కాదు, ఎవరైనా హీరో కావచ్చు. మౌళీ, నీ సినిమాలో ఎప్పుడైనా విలన్ పాత్ర ఉంటే నేను చేస్తాను. ఆ తర్వాత మా మిరాయ్ సంచలనం సృష్టిస్తోంది. అలాగే కిష్కింధ పూరి కూడా విజయాన్ని అందుకుంది. ఒకేసారి రెండు సినిమాలు హిట్ అవ్వగలవని నిరూపించాం అన్నారు. అలాగే రానున్న ఓజీ గురించి మాట్లాడుతూ, ఈ నెల తెలుగు సినిమా ఇండస్ట్రీకి మర్చిపోలేనిది. పవన్ కళ్యాణ్ గారి ఓజీ కొత్త రికార్డులు సృష్టిస్తుంది అని మనోజ్ ధైర్యంగా చెప్పుకొచ్చారు.

## ఎన్టీఆర్ చిత్రంలో రిషబ్‌శెట్టి?



అతిథి పాత్రలు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. సినిమాలో కీలకమైన దశలో అనుకోని తార తెరపై ప్రత్యక్షమైతే సినీ ప్రేమికుల్లో కలిగే ఆశ్చర్యం, ఆనందం అంతా ఇంతా కాదు. అందుకే కథ డిమాండ్ చేసిందంటే, మెరుపులాంటి ఆ అతిథి పాత్రల కోసం ప్రత్యేకమైన కసరత్తులు చేసి తారల్ని ఒప్పిస్తుంటారు దర్శకులు. అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ నటిస్తున్న సినిమాలోనూ ఓ అతిథి తళుక్కుమని మెరవబోతున్నారని సమాచారం. ఆ అతిథి ఎవరో కాదు... కన్నడ స్టార్ రిషబ్ శెట్టి. 'కాంతారా' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన కథానాయకుడు రిషబ్శెట్టి. ఆయన ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతున్న సినిమాలో ఓ చిన్న పాత్రలో సందడి చేయనున్నట్టు సమాచారం. త్వరలోనే ఈ సినిమా సెట్లోకి రిషబ్ అడుగు పెట్టనున్నారని ప్రచారం సాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ చిత్రం రూపొందుతోంది. దీనికి 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. హైదరాబాద్లోని యూ ఎస్ కాన్సులేట్కు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ వెళ్లారు. కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ఆమె ఎక్స్లో పంచుకున్నారు. ''ఎన్టీఆర్ని కాన్సులేట్కి ఆహ్వానించడం ఆనందంగా ఉంది. అమెరికాలో చిత్రీకరణ చేసుకోనున్న ఆయన ప్రస్తుత, భవిష్యత్తు చిత్రాలు భారతదేశం, అమెరికా మధ్య సంబంధాల్ని బలోపేతం చేయడంతోపాటు, ఇరు దేశాల భాగస్వామ్య శక్తిని, ఉద్యోగాల సృష్టిని చాటుతాయ''ంటూ లారా విలియమ్స్ ఎక్స్లో వ్యాఖ్య చేశారు. మిమ్మల్ని కలవడం ఎంతో ఆనందంగా ఉందంటూ ఎన్టీఆర్ ప్రతిస్పందించారు. ఎన్టీఆర్ తన కొత్త చిత్రం కోసం జిమ్లో వ్యాయామాలు చేస్తూ, శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారింది. ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ చిత్రం అమెరికాలో చిత్రీకరణ చేసుకొనే అవకాశం ఉంది.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.